ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 5 నవంబరు 2025 | 5



మొయిన్‌లో..
రామచంద్రపురంలో ఐదో తరగతి విద్యార్థిని ఆత్మహత్య
ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కాట్రేనికోన విద్యార్థికి చోటు 7

అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వైభవంగా..

మహాశాంతి హోమం



» దూర ప్రాంతాల నుంచి కాలినడకన క్షేత్రానికి చేరుకున్న వేలమంది భక్తులు 7

హోమంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

ఎట్టకేలకు..
జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ 6
» కొత్త కాంట్రాక్టర్‌కు పనులు అప్పగింత.. మాట్లాడిన ఆర్డీవో
» వారంరోజుల్లో అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్ల నిర్మాణం

భద్రతా ప్రమాణాలు పాటించని రెండు బస్సులు సీజ్

ముమ్మిడివరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మోటారు వాహనాల చట్ట నిబంధనల ప్రకారం ప్రతి ట్రావెల్ బస్సు భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని, లేకుంటే బస్సులను సీజ్ చేసి ఫిట్‌నెస్ రద్దు చేస్తామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద నిర్వహించిన తనిఖీల్లో భద్రతా ప్రమాణాలు పాటించని అజయ్ ట్రావెల్స్ బస్సు, ఒక రమణా ట్రావెల్స్ బస్సులను సీజ్ చేసి వాటి ఫిట్‌నెస్‌ను రద్దు చేశామని ఆయన చెప్పారు. జిల్లా నుంచి సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రతి ట్రావెల్ బస్సు నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు పాటించాలని, లేకుంటే బస్సును సీజ్ చేసి వాటి ఫిట్‌నెస్ రద్దు చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో డీటీవోతోపాటు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్ పాల్గొన్నారు.



అన్నంపల్లి టోల్‌ప్లాజా వద్ద బస్సులను సీజ్ చేసిన ఆర్టీవో శ్రీనివాసరావు

భద్రతే ముఖ్యం!



- » ధనార్జనే లక్ష్యంగా పలు ప్రైవేటు ఆలయాల నిర్వహణ
- » కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో వాటిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- » అడ్వైజరీ కమిటీ ఏర్పాటు ప్రకటనతో నిర్వాహకుల్లో ఆందోళన
- » భక్తుల భద్రత కోసం కలెక్టర్ స్థాయిలో పర్యవేక్షణ బాధ్యతలు
- » జిల్లాలో వేలసంఖ్యలో వెలసిన ప్రైవేటు ఆలయాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

భక్తిభావంతో కొందరు.. ధనార్జనే లక్ష్యంగా మరికొందరు.. ఇక ప్రభుత్వ స్థలాల ఆక్రమణలే లక్ష్యంగా ఇంకొందరు.. కొన్నిచోట్ల దేవాలయాలను నిర్మించి స్వామిభక్తిని ప్రదర్శించేవారు. ఇలాంటివారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా చాలామంది ఉన్నారన్న ఆరోపణలున్నాయి. వీటిపై రాష్ట్ర ప్రభుత్వం ఇక దృష్టి సారించనుంది. భక్తుల భద్రతే ముఖ్యంగా కొన్ని కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది.

కలెక్టర్ స్థాయిలో పర్యవేక్షిస్తే..

వార్షిక ఆదాయాలు కోట్ల రూపాయల్లో వచ్చే దేవాలయాలు కొన్ని అయితే.. ధూప, దీప నైవేద్యాలకు సరిపడే ఆదాయాలు వచ్చే దేవాలయాలు మరికొన్ని. ఇక కొందరు స్వార్థపరులు ధనార్జనే లక్ష్యంగా భక్తి ముసుగులో గుడులు నిర్మించి స్వార్థితాలను పెంచుకునే పనిలో కీలకంగా మారారు. ఇలా జిల్లావ్యాప్తంగా వేలసంఖ్యలో ప్రైవేటు వ్యక్తుల అధీనంలో ఉన్న దేవాలయాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నాయి. ప్రభుత్వం వీటిపై సరైన దృష్టిపెట్టాలని, జిల్లాలో ప్రైవేటు దేవాలయాల యాజమాన్యాలను కట్టడి చేయాలని పలువురు సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఇటీవల కాశీబుగ్గ వేంకటేశ్వరాలయంలో వేలసంఖ్యలో భక్తులు ఏకాదశి పర్వదినాన అనూహ్యంగా పోటెత్తడంతో తొక్కిసలాట జరిగి 9మంది భక్తులు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో ఆ సంఘటనా స్థలాన్ని సందర్శించిన దేవదాయ, ధర్మదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రైవేటు యాజమాన్యంలో నడుస్తున్న ఆలయాల భద్రతపై దృష్టిసారిస్తామని, ముఖ్యంగా అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి కలెక్టర్ స్థాయిలో వాటి పర్యవేక్షణ బాధ్యతలను అప్పగిస్తామని చేసిన ప్రకటన నేపథ్యంలో ఇప్పుడు జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆలయాల నిర్వాహకులకు మింగుడు పడడం లేదు.

వేలసంఖ్యలో ఆలయాలు..

జిల్లావ్యాప్తంగా ఉన్న 22 మండలాల పరిధిలో ఆలయాల నుంచి గ్రామీణ ప్రాంతాల్లోను, ముఖ్యంగా కాల్వగట్టు, డ్రెయిన్ల గట్టు వెంబడి వెలసిన ఆలయాలు అన్నీ కలిపితే వేలసంఖ్యలోనే ఉన్నాయి. అమలాపురం పట్టణం నుంచి అన్ని మండలాల్లోను ఈ తరహా ప్రసిద్ధ దేవాలయాలతోపాటు కోట్ల రూపాయల వార్షిక ఆదాయం వచ్చే ఆలయాలను ప్రైవేటు ట్రస్టీ బోర్డులు, కుటుంబ ట్రస్టు బోర్డుల పేరుతో నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా జిల్లాలో దుర్గాదేవి ఆలయాలు, సాయిబాబా ఆలయాలతో పాటు వేంకటేశ్వర స్వామి, ఆంజనేయస్వామి, రామాలయాలు, వినాయకుడి ఆలయాలతోపాటు గ్రామదేవతల పేరుతోను ప్రఖ్యాతి పొందిన ఆలయాలు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలు కమిటీల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి.

మొక్కుబడిగా ఆడిట్‌లు..

కోట్ల రూపాయల ఆదాయాలు వచ్చిన అమ్మవారి ఆలయాలు కూడా జిల్లాలో ప్రసిద్ధి చెందాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రైవేటు ఆలయాల నిర్వాహకులపై దృష్టిసారించనున్నందున ఇప్పటివరకు కుటుంబ ట్రస్టీల పేరుతో ఉన్న ఆలయ కమిటీలను మార్పులు చేసే పనిలో కొందరు నిమగ్నమయ్యారు. ఆదాయాలు, ఆడిట్ వంటివి మొక్కుబడిగా చేయిస్తున్నారు. ఆయా ఆలయాలకు వచ్చే కానుకలు అయితే కొన్నింటిలో కనుమరుగవుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భక్తిభావంతో ఉన్న వందలాది భక్తులు ఆయా ప్రాంతాల్లో ఉన్న భక్తి విశ్వాసాలతో కానుకలు సమర్పిస్తున్నారు. ఇవి ఎక్కడా రికార్డు కూడా కావడం లేదనేది భక్తుల అభిప్రాయం. ముఖ్యంగా జిల్లాలో ఉన్న ప్రైవేటు ఆలయాల్లో జరుగుతున్న స్వార్జిత అక్రమాల పేరుతో నిర్వహిస్తున్న కొన్ని ఆలయాలపై దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు దృష్టిపెట్టి స్వాధీనం చేసుకోవాలని భక్తులు కోరుతున్నారు. అడ్వైజరీ కమిటీ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసి ప్రైవేటు ఆలయాలపై తరచూ తనిఖీలు నిర్వహిస్తే కొన్ని అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చనేది భక్తుల అభిప్రాయం.

కెరియర్ కౌన్సెలింగ్ గైడెన్స్..

విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచి

» ఉపాధ్యాయులతో సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్



కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కెరియర్ కౌన్సెలింగ్ గైడెన్స్ ప్రక్రియ 8నుంచి 10 తరగతుల విద్యార్థులకు భవిష్యత్తు కోసం దిక్సూచిగానిలుస్తుందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో కెరియర్ గైడెన్స్ ఒరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మొదటి దశలో ప్రతి పాఠశాలలో కెరియర్ ట్రీ ప్రింటింగ్ చేయించి ప్రాథమిక దశలో అవగాహన పెంచాలని, రెండో దశలో కరపత్రాలను బుక్‌లెట్లుగా ముద్రించి ప్రచారం కల్పించాలని తెలిపారు. భవిష్యత్తు కోర్సుల ఎంపిక, ఆసక్తి ఉన్న వారికి అవగాహన కల్పించాలని, మూడో దశలో ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా విస్తృతంగా ఉన్న అవకాశాల పట్ల అవగాహన కల్పించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. నవంబరు 30 నాటికి ప్రతి పాఠశాలలో పక్షం రోజులకు ఒకసారి కెరియర్ కౌన్సెలింగ్ క్లాస్ నిర్వహించేలా విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్, టీమ్ వర్క్ వంటి మార్గాలకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, డిప్యూటీ విద్యాశాఖాధికారి బీవీ సుబ్రహ్మణ్యం, పూర్వపు విద్యార్థి పి.నవీన్, హెచ్ఎం చిరంజీవి, సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'కుష్టు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి'

ఈనెల 15నుంచి జిల్లాలో స్పర్శ కుష్టువ్యాధి ప్రచార కార్యక్రమాలు నిర్వహించి కుష్టువ్యాధి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం కలెక్టరేట్‌లో వైద్యసిబ్బందిని ఆదేశించారు. 15రోజులపాటు నిర్వహించే ప్రచార గోడపత్రికలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వ్యాధిలక్షణాలుఉన్న రోగులను సకాలంలో గుర్తించి వైద్యసహాయం అందించడమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రజల్లో కుష్టువ్యాధిపై అవగాహన పెంచి సమాజంలో వివక్షత లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి తిప్పికొడితే చికిత్సతో సరి చేసుకోవచ్చనని, ముఖ్యంగా ప్రభుత్వ వైద్యసిబ్బంది ద్వారా నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజలసేవలతోపాటు సలహాలు పొందాలని సిబ్బందికి సూచించారు. వైద్య పరీక్షా క్యాంపులు నిర్వహించి మల్టీ డ్రగ్ థెరపీ ద్వారా చికిత్స ప్రారంభిపచేస్తారని, ఈ ప్రచార కార్యక్రమం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ సూచించారు. అదనపు డీఎంహెచ్‌వో భరతలక్ష్మి మాట్లాడుతూ 17 నుంచి 30 వరకు నిర్వహిస్తున్న కుష్టు వ్యాధి మైక్రో బ్యాక్టీరియం లెప్రసీ అనే బ్యాక్టీరియాను పూర్తిగా నిర్మూలించాలని కోరారు. పలువురు ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.1650 కోట్లతో వాటర్ గ్రిడ్: కలెక్టర్

జిల్లాలో రూ.1650కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలు చేయడం ద్వారా సురక్షితమైన తాగునీరు అందించాలనే సంకల్పంతో జలజీవన్ మిషన్ చేపట్టిన ఈ పథకం పైపులైన్లు బొబ్బర్లంక హెడ్‌వర్క్స్ నుంచి చిట్టచివరి ప్రాంతం వరకు ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. స్థానిక కాల్వల ద్వారా నీటిని సేకరించి శుద్ధి చేసి సరఫరా చేస్తున్నప్పటికీ సురక్షితంగా, శ్రేయస్కరంగా లేకపోవడంతో నేరుగా గోదావరి నీటిని పైపులైన్ల ద్వారా శుద్ధి చేసి జిల్లావ్యాప్తంగా సరఫరా చేయాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని మంజూరు చేస్తామని కలెక్టర్ వివరించారు. డ్యామేజీలకు సంబంధించి జిల్లావారీగా అంచనాలు నివేదించాలని తెలిపారు. ఈ నెలాఖరు నాటికి ఆర్అండ్‌బీ, జలవనరులు, డ్రైనేజీ, పంచాయతీరాజ్‌శాఖలకు అయ్యే డ్యామేజీ ఖర్చుల అంచనాలను నివేదించాలని ఆదేశించారు. ఆర్డీవో శ్రీకర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ రాజన్, పంచాయతీరాజ్ ఎస్ఈ రామకృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ రాము, జలవనరులశాఖ ఈఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయ విధానాలపై శిక్షణ తరగతులు ప్రారంభం

అమలాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్తమ సహజ వ్యవసాయ పద్ధతులను నిరంతరం అభ్యసించేవారు వారి సొంత పొలాల్లో వినూత్న కార్యకలాపాలు అమలుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ఐదురోజులపాటు నిర్వహించనున్న సేంద్రియ వ్యవసాయ విధానాలపై మంగళవారం శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సేంద్రియ, సాగు విధానాలను ప్రోత్సహిస్తూ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను 2016నుంచి ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ఇది రసాయన, కృత్రిమఎరువులు, పురుగుమందులను ఉపయోగించకుండా సహజ వనరులను పెంచుకునే విధానమన్నారు. ఈ పథకం రైతులకు దిగుబడి పెంచడం, ఖర్చులు తగ్గించడం, పర్యావరణ స్నేహపూర్వక పద్ధతులను తీసుకువస్తుందన్నారు. జిల్లాలో సేంద్రీయ సాగు విస్తీర్ణాన్ని పెంచడం ద్వారా వివిధ రకాల పంటలు సాగు చేయాలని సూచించారు. రసాయన ఇన్‌పుట్స్ వాడకాన్ని నిషేధించాలన్నారు. పంటల కోసం స్థానిక విత్తనాలనే వాడాలని సూచించారు. పలు అంశాలపై శిక్షణలో పాల్గొన్న వారికి కలెక్టర్ సూచనలిచ్చారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి బోసుబాబు, వ్యవసాయశాఖ అధికారులు, ఫార్మర్ మాస్టర్ ట్రైనర్లతోపాటు వైఎస్సార్ ఉద్యానశాస్త్రవేత్తలు శిక్షణలో పాల్గొన్నారు.



సేంద్రియ వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆటో-బైక్ ఢీకొన్న ఘటనలో..
పెయింటర్ మృతి
» మరొకరికి తీవ్రగాయాలు
» మండపేట మండలం ద్వారపూడి శివారులో ఘటన 7

ఎల్ఆర్ఎస్ ఆస్తిపై..

సంపూర్ణ హక్కులు



- » అనధికార లేఅవుట్లు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు మరోసారి అవకాశం
- » నిర్ణీత మొత్తాలను చెల్లించి హక్కులు పొందొచ్చు
- » వచ్చే ఏడాది జనవరి 23 వరకు గడువు పొడిగింపు

అమలాపురంటౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అనధికార లేఅవుట్లు, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. లేఅవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ కింద అనధికార లేఅవుట్లు, అక్రమ కట్టడాలను క్రమబద్ధీకరించుకుకోవచ్చు. లేఅవుట్‌లు రెగ్యులైజేషన్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం సూచించిన నిర్ణీత మొత్తాలను చెల్లించడం ద్వారా ఆస్తిపై సంపూర్ణ హక్కులు పొందవచ్చునని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జీవోఎంఎస్ నెంబరు 134 ప్రకారం ఈ ఏడాది జూలై 30 నాటికి రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ప్లాట్లు ఎల్ఆర్ఎస్ స్కీమ్ కిందకు వస్తాయని ముందుగా ప్రకటించారు. ఇందుకు సంబంధించిన గడువు ఈ ఏడాది అక్టోబరు 23తో ముగిసింది. అంతగా ఎవరూ క్రమబద్ధీకరణకు ముందుకు రాకపోవడంతో మరోసారి గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసినట్టు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ తెలిపారు. జీవోఆర్టీ నెంబరు 1173 ప్రకారం ప్లాట్ల క్రమబద్ధీకరణకు గడువును 2026, జనవరి 23 వరకు పొడిగిస్తూ అముడాకు, మున్సిపల్ కార్యాలయానికి ఉత్తర్వులను జారీ చేశారు. అముడా పరిధిలో వందలాదిగాఅనధికార భవన నిర్మాణాలు,అనధికార లేఅవుట్లు ఉన్నా వారిలో చైతన్యం తీసుకువచ్చే దిశగాగతంలో అధికారులు చర్యలు తీసుకోకపోవడంవల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్న విమర్శలున్నాయి. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల భవిష్యత్తులో న్యాయబద్ధమైన లావాదేవీలు, మౌలిక సదుపాయాలైన నీరు, విద్యుత్, డ్రైనేజీ సదుపాయం, భవనాలు, లేఅవుట్లకు చట్టబద్ధ అనుమతులు పొందవచ్చునన్నారు.గడువు ముగిసిన తర్వాత వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమన్నారు. రెండోసారి గడువు పొడిగించినా క్రమబద్ధీకరణకు ముందుకు రాని అన్నిలేఅవుట్లు,ప్లాట్లు వివరాలను సంబంధిత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిషేధితభూముల జాబితాలో చేరుస్తామని హెచ్చరించారు. చట్టబద్ధహక్కులను పొందాలని, వివరాలకు అమలాపురం పురపాలక సంఘ టౌన్ ప్లానింగ్ విభాగాన్ని సంప్రదించాలని మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ కోరారు.

టీచర్లకు.. పరీక్ష



ప్రభుత్వ ఉపాధ్యాయులకు తప్పనిసరి

- » 2011 ముందు నుంచి అమలు
- » రెండేళ్లలో ఉత్తీర్ణత అవకాశం
- » 23 వరకు దరఖాస్తు గడువు
- » డిసెంబర్ 10న పరీక్ష
- » టెట్‌కు పెరిగిన డిమాండ్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

టెట్..టీచర్స్ ఎలిజిబులిటీ టెస్ట్.. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేవారందరూ తప్పనిసరిగా ఎదుర్కోవాల్సిన పరీక్ష..ఈ పరీక్ష పాసైతేనే.. పాఠాలు చెప్పేందుకు అర్హులు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలైనా.. ప్రైవేటు స్కూలైనా.. బడిలో పాఠాలు బోధించాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాల్సిందే. 2011కి ముందు ఉపాధ్యాయులుగా విధుల్లోకి చేరిన వారందరూ ఈ పరీక్ష రాయాల్సిందే. రెండేళ్లలో టెట్ ఉత్తీర్ణత సాధించాలి.. ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలివి. ఈ నిబంధనలతో ఉపాధ్యాయులు పరీక్షకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

23వరకు దరఖాస్తు గడువు

నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులతోపాటు ఈసారి ఇన్ సర్వీస్ టీచర్లకు టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్(టెట్) ఉత్తీర్ణత తప్పనిసరి చేయడంతో పరీక్ష నిర్వహణకు ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. ఈనెల 23వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాల్సి ఉంది. డిసెంబర్ 10న పరీక్ష ఉండడంతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. డిసెంబర్ 3 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 150 మార్కుల చొప్పున రెండు పేపర్లను రాయాలి. డిసెంబర్ 10వ తేదీ ఉదయం 9.30 నుంచి ఒక సెషన్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో సెషన్ ఇలా రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తారు. వచ్చే ఏడాది జనవరి 2న టెట్ కీ విడుదల చేయనున్నారు. తుది కీ జనవరి 13న ప్రకటించిన అనంతరం 19న టెట్ ఫలితాలను ప్రకటించనున్నారు.

పది వేల మందిపైనే పరీక్షకు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పది వేల మంది వరకూ ఇన్‌సర్వీస్‌లో ఉపాధ్యాయులు టెట్ రాయాల్సి ఉంటుంది. జిల్లాలో 6 వేల మంది ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిలో సగం మందికి పైగా టెట్ రాయాల్సి ఉంది. 2012, 2014, 2018, 2025 నుంచి టెట్‌లో ఉత్తీర్ణులైన వారినే డీఎస్సీకి ఎంపిక చేస్తున్నారు. పేపర్-1, 2 క్వాలిఫై అయిన వారు మాత్రమే ఎంపికయ్యారు. 2011కు ముందు ఉద్యోగాల్లో చేరిన వారందరూ కచ్చితంగా టెట్ రాయాలి. ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఆదర్శ పాఠశాల, గురుకుల, మునిసిపల్ పాఠశాలల్లోను, గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో పనిచేస్తున్న వారికి ఇదో పెద్ద పరీక్షలా ఉంది. టెట్ ప్రకటనపై ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు అయోమయ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరీక్షను ఎలా ఎదుర్కోవాలా అని 2011కి ముందు ఎంపికైన అభ్యర్థులు తలలు పట్టుకుంటున్నారు. 1994, 1996, 1998, 2000, 2001, 2002, 2003, 2008 డీఎస్సీ ఉపాధ్యాయులు తప్పనిసరిగా టెట్ రాయాలి.ఇదిలా ఉంటే 2030 ఆగస్టు 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ గ్రేడ్-2, హెచ్ఎం తదితర కేడర్ల ఉపాధ్యాయులకు ఈ టెట్ నుంచి మినహాయింపునిచ్చారు.ఉపాధ్యాయ సంఘాలు టెట్ అర్హతపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొన్ని సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయి. ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు కోరుతూ కొంతమంది ఎమ్మెల్సీలు మంత్రి లోకేశ్‌ను కలిశారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఎదురుచూస్తున్నారు.



ఏడిదలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఇతర అధికారులు

నేడు ఏడిదలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

- » హాజరుకానున్న కలెక్టర్
- » ఏర్పాట్ల పరిశీలన

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట మండలం ఏడిదలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మహేష్ కుమార్ బుధవారం ప్రారంభిస్తామని మండపేట తహసీల్దార్ పి.తేజేశ్వరరావు తెలిపారు. ఈనేపథ్యంలో ఏడిద గ్రామ పంచాయతీ వద్ద ఉన్న రైతుసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం మండపేట మండల తహసీల్దార్ తేజేశ్వరరావు, వ్యవసాయశాఖఅధికారి కె.ప్రభాకర్ కూటమి నేతలతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ ప్రారంభించే కేంద్రాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిశాంతి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రామచంద్రపురం ఆర్డీవో అఖిల, జిల్లా సివిల్ సప్లయి అధికారి, వ్యవసాయశాఖ జేడీ పాల్గొంటారని అధికారులు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ద్వారా విక్రయించుకుని గిట్టుబాటు ధర పొందాలని వారు కోరారు.





నూతన విద్యుత్ సర్వీసుల జారీకి తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) సరికొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. పారదర్శకత పెంచి వినియోగదారులకు సత్వర సేవలందించేందుకు ఏపీఈఆర్‌సీ నియమావళికి అనుగుణంగా విద్యుత్ సర్వీసు జారీలో కొత్త విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వేగంగా, సులభంగా పొందాలనే లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 'ఈజ్ ఆఫ్ లివింగ్' కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నారు.

ఇకపై క్షణాల్లో...

- సులభంగా, వేగంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు
- కొత్త విధానానికి శ్రీకారం చుట్టిన ఈపీడీసీఎల్
- దరఖాస్తు సమయంలోనే స్థిర చార్జీల నిర్ణయం
- రాష్ట్రంలోనే తొలిసారిగా అమలు

(సామర్లకోట-ఆంధ్రజ్యోతి)

విద్యుత్ సర్వీసుల జారీ ప్రక్రియను సులభతరం చేయడం, చార్జీల అమలులో పారదర్శకత తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ జారీ చేసిన నిబంధనలు-2020కు అనుగుణంగా ఏపీఈఆర్‌సీ-2013 నాటి విధానాల్లో అవసరమైన సవరణలు చేసింది. కొత్త విద్యుత్ సర్వీసు జారీకి ఇప్పటివరకు దరఖాస్తు స్వీకరించిన తర్వాత స్థల పరిశీలన చేసి ఎంత వ్యయం అవుతుందో అంచనా వేసేవారు. దానిపై సర్వీసు లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. తనిఖీకి వచ్చిన అధికారి విచక్షణపై ఈ ప్రక్రియ మొత్తం ఆధారపడి ఉండేది. అందుకు కొంత సమయం పట్టేది. ఇప్పుడు కొత్త విధానంలో ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్లు, అంచనాల తయారీ లేకుండా వేగవంతమైన సేవలతో సర్వీసు చార్జీలపై వినియోగదారులు ముందుగానే స్పష్టమైన అవగాహన పొందుతారు.

150 కిలోవాట్ల వరకు ఉన్న కనెక్షన్‌కు స్థిర (ఫిక్స్‌డ్) చార్జీ ఉంటుంది. ఒక కిలోమీటరు పరిధిలో ఇప్పటికే విద్యుదీకరణ పూర్తయిన ప్రాంతాల్లో 150 కిలోవాట్ల వరకు లోటెన్షన్, హైటెన్షన్ కనెక్షన్లలో, 75 కిలోవాట్లకు పైగా 150 కిలోవాట్ల వరకు కోరే వినియోగదారులు ఈ చార్జీలకు అర్హులవుతారు. అయితే ఒక కిలో మీటరు దూరానికి మించి ఉన్న ప్రాంతాలు, కొత్త లే-ఔట్ల విద్యుదీకరణ, వ్యవసాయ, అనుబంధ కనెక్షన్లు, అండర్‌గ్రౌండ్ కేబులింగ్ అవసరమయ్యే సందర్భాల్లో ఈ చార్జీలు వర్తించవు. దరఖాస్తు రుసుము, సెక్యూరిటీ డిపాజిట్ తదితర రుసుములు ప్రస్తుత నియమావళి ప్రకారం కొనసాగుతాయి.

పాత విధానంలో ఇలా...

ఇది వరకు కొత్త విద్యుత్ సర్వీసుల జారీకి దరఖాస్తు చేసిన తర్వాత సైట్ ఇనస్పెక్షన్, ఎస్టిమేట్ తయారీ వంటి ప్రక్రియల ద్వారా కనెక్షన్ చార్జీలను నిర్ణయించేవారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు వినియోగదారుడికి ఎంత మొత్తం చెల్లించాలి అనేది స్పష్టంగా తెలిసేది కాదు. ఎస్టిమేట్‌పై ఆధారపడి సర్వీసు లైన్ చార్జీలు, డెవలప్‌మెంట్ చార్జీలు వసూలు చేసేవారు. ఈ ప్రక్రియలో దూరం, ప్రాంతం, లోడ్ వంటి అంశాలపై చార్జీలు మారుతూ ఉండేవి.

కొత్తగా అమలులోకి వచ్చిన విధానంలో 150 కిలోవాట్ల వరకు ఉన్న అన్ని కొత్త కనెక్షన్లకు అదనపు లోడ్‌లకు కేటగిరీ ఆధారంగా స్థిర చార్జీలు నిర్ణయించారు. ఇప్పుడు సైట్ ఇనస్పెక్షన్ లేదా ఎస్టిమేట్ అవసరం లేకుండా దరఖాస్తు సమయంలోనే వినియోగదారుడు చెల్లించాల్సిన మొత్తం స్పష్టంగా తెలుస్తుంది. తద్వారా సర్వీసు జారీ ప్రక్రియ వేగవంతమవుతుంది. డెవలప్‌మెంట్ చార్జీ, సర్వీస్‌లైన్ చార్జీ కలిపి స్థిర చార్జీ నిర్ణయించడంతో ఎటువంటి అదనపు చార్జీ వసూలు చేయట్లేదు. ఒక కిలోమీటరు పరిధిలో ఉన్న వినియోగదారులందరికీ ఒకే రకమైన చార్జీలు వర్తిస్తాయి. 20 నుంచి 150 కిలోవాట్ల వరకు రూ.12,600 చొప్పున, హెచ్‌టీ 75-150 కిలోవాట్ల వరకు రూ.4,400 వసూలు చేస్తారు.



వినియోగదారులకు వెసులుబాటు

అల్లంరాజు వీఎన్‌డీఎస్ ప్రభాకర్
ఏపీఈపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు, పెద్దాపురం

కొత్త విద్యుత్ సర్వీసుల జారీ ప్రక్రియను సులభతరం చేయడం ఈ విధానం ప్రధాన ఉద్దేశ్యం. స్థిర చార్జీలను ముందుగానే నిర్ణయించడంతో ఎస్టిమేట్ తయారీలో ఎటువంటి జాప్యం ఉండదు. ఎవరికి ఎంత లోడ్ అవసరం అవుతుందో లెక్కించుకుని ఆ మేరకు విద్యుత్ కనెక్షన్‌కు చార్జీలు చెల్లించాలి. పారదర్శకతతో పాటు వేగవంతంగా సేవలందుతాయి. విద్యుత్ వినియోగదారులు సమయాన్ని వృథా చేసుకోకుండా కనెక్షన్ పొందవచ్చు.

మహిమాన్విత క్షేత్రం కుండలేశ్వరం

- వృద్ధ గౌతమి నదీ తీరాన కొలువైన కుండలేశ్వరుడు
- గౌతమ ముని ప్రతిష్ఠించినట్టు పురాణాల్లో ప్రస్తావన
- క్షేత్ర మహత్యాన్ని చాటిచెప్పిన ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు
- ఇటీవలి కాలంలో ఆలయానికి పెరిగిన భక్తుల తాకిడి


విశేష అలంకరణలో కుండలేశ్వర స్వామి

(కాట్రేనికోన-ఆంధ్రజ్యోతి)

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలంలో వృద్ధ గౌతమి నదీ తీరాన కుండలేశ్వరుడు కొలువై ఉన్న మహిమాన్విత క్షేత్రం కుండలేశ్వరం. 15వ శతాబ్దంలో మహాకవి శ్రీనాథుడు ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని వివరించాడు. విరూపాక్షుడే కుండలేశ్వరుడని కాశీ ఖండములోను, 'కోటిపల్లి శుకోమలాంధ్రములకు మ్రొక్కి, కుండలాముఖ తీర్థంబు గురించి గౌతమి, గంగ లవణాబ్ధిగౌగలించె' అని భీమఖండంలోను వర్ణించారు. బ్రహ్మాండ పురాణంలో వ్యాస మహర్షి ఈ క్షేత్రం గురించి వివరించారు. శంకరాచార్యకృతమైన చంద్రశేఖరాష్టకంలో కుండలేశ్వరుని మార్కండేయుడు ధ్యానించినట్టు శ్లోకాలున్నాయి.

- పురాణాల్లో కుండలేశ్వర పుణ్య క్షేత్ర ప్రస్తావన ఉంది.
- కుండలం ఆకారంలోని శివలింగాన్ని గౌతమ ముని ఇక్కడ ప్రతిష్ఠించినట్టు చెప్తారు.
- ఈ క్షేత్ర నదీగర్భం కుండల తీర్థంగా ప్రసిద్ధిగాంచింది.
- అర్ధరాత్రి వేళ ఇక్కడ ఓంకార నాదాలు వినిపిస్తాయని స్థానికులు చెప్తున్నారు.
- ఆలయ గోపురంలో 23 శివలీలల విగ్రహ మూర్తులు ఉండడం విశేషం.
- కార్తీక మాసం, మహా శివరాత్రి పర్వదినాలే కాకుండా మిగిలిన రోజుల్లో కూడా భక్తులు గణనీయంగా రావడం విశేషం. టూరిస్టు వాహనాలు సైతం క్యూ కడుతున్నాయి. దీంతో ఆలయంలో భక్తుల కోసం పలు చర్యలు చేపట్టారు. కార్తీక మాసంలో నిత్యాన్నదానం కొనసాగుతోంది.

కుండలేశ్వర క్షేత్రం దర్శనం అనంతరమే కాశీ రావాలని పండితులు తనతో చెప్పినట్టు ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తన కాశీయాత్ర అనుభవాలను కుండలేశ్వరంలో వివరించారు. ఆయన తన ప్రవచనాల్లో కుండలేశ్వర క్షేత్రం గురించి స్థానికులకు తెలియని ఎన్నో అంశాలను ప్రస్తావించారు. తాము తరచూ కుండలేశ్వరం వచ్చి గౌతమి నదిలో స్నానమాచరించి కుండలేశ్వరుని దర్శించుకుంటామని అక్కడ పలువురు మహా పండితులు తనకు వివరించినట్టు చాగంటి తన మనసులోని మాటను భక్తులతోపంచుకున్నారు. అంతే కాదు ఆయన సొంత నిధులతో కుండలేశ్వరంలో పలు నిర్మాణాలు చేపట్టారు. దీంతో ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల భక్తులు వేలాదిగా తరలి వస్తున్నారు.



- భక్తుల తాకిడి పెరగడంతో దేవదాయ శాఖ అధికారులు ఈ ఆలయంపై దృష్టి సారించారు. ఉప కమిషనరు, ఈఈ, డీఈఈ, స్థపతి, జిల్లా అధికారులు కుండలేశ్వర క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించారు.


ఆలయ గోపురంపై శివలీలలు చాటే విగ్రహాలు


రజత జటాఝూట అలంకరణలో కుండలేశ్వరస్వామి


కుండలేశ్వరంలోని పుష్కర ఘాట్

జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- కొత్త కాంట్రాక్టర్‌కు పనులు
- ముందుగా అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్లు నిర్మాణం
- కాంట్రాక్టర్‌తో చర్చించిన కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

ఆలమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏడాదిన్నరగా నిలిచిపోయిన జొన్నాడ ఫ్లైఓవర్ పనులకు ఎట్టకేలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. పాత కాంట్రాక్టును రద్దు చేసి కొత్త కాంట్రాక్టర్‌ను నియమించడంతో మంగళవారం పనులకు శ్రీకారం చుట్టారు. వారం రోజుల వ్యవధిలో ముందుగా అధ్వానంగా ఉన్న సర్వీసు రోడ్లను నిర్మించనున్నారు. దాదాపు మూడేళ్ల క్రితం నిర్మాణానికి జొన్నాడ, రాజమహేంద్రవరంలలో ఫ్లైఓవర్లు నిర్మించడానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ శంకుస్థాపన చేశారు. అయితే 2024 ఏప్రిల్ నాటికి రాజమహేంద్రవరం పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్ జొన్నాడ ఫ్లైఓవర్ పనులు మాత్రం నత్తనడకగా సాగించారు. అయితే 2024 సాధారణ ఎన్నికల అనంతరం పనులు పూర్తిగా నిలుపుదల చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ, కలెక్టర్‌తోపాటు పలువురు అధికారులు రివ్యూ చేసినప్పటికీ ఈ వారంలో మొదలు పెడతామని మభ్యపెట్టారు. సెప్టెంబరు నెలలో రాష్ట్రస్థాయిలో జరిగిన కలెక్టర్ల సమావేశంలో కోనసీమ కలెక్టర్ మహేష్‌కుమార్, అంతకు ముందుగానే ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తక్షణం పాత కాంట్రాక్ట్‌ను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలవాలని సూచించారు. ఈ మేరకు కొత్తగా కాంట్రాక్టు ఖరారు చేశారు.

కాంట్రాక్టర్‌కు పనుల అప్పగింత

కొత్తగా నిర్మాణ బాధ్యతలు స్వీకరించిన కాంట్రాక్టు ప్రతినిధి సురేష్‌కు మంగళవారం బాధ్యతలు అప్పగించారు. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, ఆలమూరు తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు, ఎంపీడీవో ఎ.రాజు, టీడీపీ నాయకుడు సలాది నాగేశ్వరరావు తదితరులు జొన్నాడ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించి తక్షణం సర్వీసు రోడ్లను బాగు చేయాలని సూచించారు. దాంతో వారం రోజుల వ్యవధిలో నిర్మించనున్నట్టు సురేష్ వివరించారు.


జొన్నాడలో కాంట్రాక్టర్‌తో చర్చిస్తున్న ఆర్డీవో శ్రీకర్

జూన్ నాటికి 5,6 యూనిట్లు సిద్ధం

- సీలేరు కాంప్లెక్స్ సీఈ రాజారావు
- పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో పనులు
- వర్షాలతో నిలిచిన వైనం

మోతుగూడెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎడ తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌లోని పొల్లూరు జలవిద్యుత్ కేంద్రంలో రూ.510 కోట్లతో నిర్మిస్తున్న 5,6 యూనిట్ల పనుల్లో రెండు నెలలపాటు జాప్యం చోటు చేసుకుంది. జెన్కో సీఎండీ ఆదేశాలతో రెండు యూనిట్ల నిర్మాణం పూర్తయ్యే వరకు రేయింబవళ్లు పనులు చేయనున్నట్టు సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీరు రాజారావు తెలిపారు.. ప్రస్తుతం నాలుగు యూనిట్ల ద్వారా 460 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. 5, 6 యూనిట్ల నిర్మాణం పూర్తయితే అదనంగా 230 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు. 2026 మార్చి నెలాఖరుకు ఐదో యూనిట్, జూన్ నెలాఖరుకు ఆరో యూనిట్ పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. ఇప్పటికే పెనస్టాక్ పనులు 70 శాతం, పవర్ హౌస్ ఇన్‌సైడ్ సివిల్ పనులు 60శాతం, ఎలక్ట్రికల్, మెకానికల్ పనులు 40 శాతం పూర్తయ్యాయన్నారు. ప్రస్తుతం పవర్ కెనాల్ ద్వారా ఫోర్బ్ జలాశయానికి వచ్చే నీటితో ఆరు యూనిట్లలో పీక్ అవర్స్‌లో రెండు, మూడు గంటలపాటు విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఆరు యూనిట్ల ద్వారా నిరంతరం విద్యుదుత్పత్తి చేయాలంటే ప్రస్తుతం ఉన్న పవర్ కెనాల్ పక్కన మరో పైప్లాన్ నిర్మించాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం రోజుకు ఏడు నుంచి ఎనిమిది మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందన్నారు. బలిమెల జలాశయంలో మన వాటాగా 62.9 టీఎంసీల నీరు, డొంకరాయి జలాశయంలో 12.7 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. రానున్న రోజుల్లో తాగునీటికి, విద్యుదుత్పత్తికి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

కాకినాడలో ట్రైనింగ్ హబ్‌కు ప్రతిపాదనలు


కలెక్టర్ షాన్‌మోహన్‌తో సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ క్యాంపస్ హెడ్ మెర్లిన్, చిత్రంలో పీడీ లచ్చారావు

కాకినాడ సిటీ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సదర్లాండ్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీ(ఇండియా) ద్వారా కాకినాడలో ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తామని ఆ కంపెనీ క్యాంపస్ హెడ్ మెర్లిన్ మంగళవారం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి తమ ప్రతిపాదనలను వివరించారు. ఈ సందర్భంగా మెర్లిన్ మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా విద్యార్థులు ఇన్నోవేటివ్ ఐడియాలజీ ద్వారా వివిధ ప్రాజెక్టులను తయారు చేయడానికి 60 రోజులు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం సర్టిఫికెట్‌తో పాటు కంపెనీలోనే ఏడాదికి రూ.2.5 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు జీతంతో ఉద్యోగం కల్పిస్తామన్నారు. మూడు ట్రైనింగ్ సెంటర్లతో పాటు ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసి కాకినాడను ట్రైనింగ్ హబ్‌గా తయారుచేయడానికి సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. ఇందుకు కలెక్టర్ షాన్‌మోహన్ సానుకూలంగా స్పందించి శిక్షణకు కావల్సిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. శిక్షణ చేపడుతున్న వికాస పీడీ లచ్చారావును అభినందించారు. మేనేజరు పి.శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు రోజిలి ఎంపిక



కోరుకొండ, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల జడ్పీ హైస్కూల్ ప్లస్ పాఠశాల పదో తరగతి విద్యార్థిని ములగలేటి రోజిలి జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం జేబీఎస్ శ్రీనివాస్ తెలిపారు.ఇటీవల కొవ్వూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్టు చెప్పారు. ఈ నెల 11నుంచి 14వరకు ఉత్తరప్రదేశ్‌లో జరిగే పోటీలో రోజిలి పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణితో పాటు వ్యాయామోపాధ్యాయుడు కేవీ సత్యనారాయణరావులను డీఈవో కె.వాసుదేవరావు,ఎంఈవోలు కుశలవ దొర, సుజాత, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ కర్రి రమేష్ తదితరులు అభినందించారు.

ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ శాస్త్రీయ సలహా మండలి సమావేశాలు


మండలి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-ఎన్ఐఆర్‌సీఏ) శాస్త్రీయ సలహా మండలి సమావేశాలు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరగనున్న ఈ సమావేశాలకు వివిధ విశ్వవిద్యాలయాల మాజీ వైస్ చాన్సలర్లు, శాస్త్రవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వాణిజ్య పంటలైన పొగాకు, మిరప, అశ్వగంధ, ఆముదం పంటల భవిష్యత్ ప్రణాళికల కోసం శాస్త్రీయ సలహాలు,సూచనలు అందజేశారు.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానన్నారు. సుమారు 29ప్రాజెక్టులు బయట మూలాల నుంచే స్పాన్సర్ అయ్యాయని వీటిలో 34శాతం రెవెన్యూ ఇస్తున్నాయని సంస్థ డైరెక్టర్ శేషుమాధవ్‌ను అభినందించారు.దేశంలో పొగాకు విత్తన అవసరాలను ఎన్ఐఆర్‌సీఏ మాత్రమే రైతులకు అందిస్తోందన్నారు.సంస్థ ఇతర వాణిజ్య పంటలను మేళవించి సత్ఫలితాలతో రూపాంతరం చెందడం సంతోషంగా ఉందన్నారు.భవిష్యత్‌లో పొగాకు పంట బ్యాన్ చేసే అవకాశం వుందని అందువల్ల వాణిజ్య పంటల్లో ప్రత్యామ్నాయ సాగు పట్ల పరిశోధనలు చేపట్టాలన్నారు.కె.సరళ, ఎలికే ప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు ముగ్గురు పీఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఆంజనేయులు

కాకినాడ రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కాకినాడ పీఆర్ ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యూనివర్సిటీ కాలిజియేట్ రెజ్లింగ్ పోటీల్లో 46 కిలోల విభాగంలో పీఆర్ కాలేజీ బీఎస్సీ విద్యార్థిని ఎం.జాహ్నవి, 59 కిలోల విభాగంలో బీఎస్సీ ఫస్టియర్ విద్యార్థిని ఎస్ఏ ప్రణతి, 76 కిలోల విభాగంలో పి.తనిష్క బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ ముగ్గురు ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ టీమ్‌లో స్థానం సాధించారని, ఈ నెల 27 నుంచి రాజస్థాన్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపాల్ కందుల ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులతోపాటు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌చార్జి ఎస్‌వీవీఎల్‌జీ వర్మ, డీవీ రమణ, కె.దుర్గారావు, శ్రీనులను ప్రత్యేకంగా అభినందించారు.

సహకార చట్టం మేరకు సొసైటీల్లో తనిఖీలు

డీసీసీబీ చైర్మన్ రామస్వామి


సూపర్‌వైజర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల చట్టం ప్రకారం సొసైటీల్లో తనిఖీలు చేయాలని రైతులకు ప్రతీ రుణాన్ని అందేటట్టు చూడాల్సిన బాధ్యత డీసీసీబీ సూపర్‌వైజర్లకు ఉందని చైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు)సూచించారు.కాకినాడ డీసీసీబీ సమావేశ హాల్లో రాష్ట్ర సహకార యూనియన్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీసీసీబీ ఉద్యోగులకు త్రైమాసిక తనిఖీలపై మంగళవారం శిక్షణ నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తుమ్మల బాబు మాట్లాడుతూ సొసైటీల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని, రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహించి ఎన్‌పీఏ తగ్గించాలన్నారు. రైతులు, సొసైటీల నుంచి వచ్చే ఫిర్యాదులపై సరైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. సహకార వారోత్సవాల సందర్భంగా 4నెలల పాటు క్షేత్రస్థాయిలోనే ఉండాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో పి.ప్రవీణ్ కుమార్, డీజీఎం శ్రీధర్ చౌదరి, డీఎల్‌సీవో పీబీఎస్ కుమార్, జిల్లా ఇన్‌చార్జి సహకార శిక్షణాధికారి ఆదిమూలం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

7న కాకినాడలో జాబ్‌మేళా

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఇసుజు మోటార్స్ కంపెనీలో పనిచేయడానికి కాకినాడ ఐటీఐలో ఈ నెల 7న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల ప్రధానాధికారి ఎం.వేణుగోపాలవర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ 2022 నుంచి 2025లోపు ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల వారు కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఉదయం 9నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావాలని పేర్కొన్నారు.

పారా స్విమింగ్ చాంపియన్‌షిప్‌లో సచివాలయ ఉద్యోగి విజయం



కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏలూరులో జరిగిన 7వ ఏపీ పారా స్విమింగ్ చాంపియన్‌షిప్-2025లో కాకినాడ సచివాలయానికి చెందిన ఉద్యోగి లంక నాగేశ్వరరావు ప్రతిభ కనబరిచి రెండు పతకాలు సాధించారు. కాకినాడ డ్రైఫిష్ మార్కెట్ సచివాలయంలో అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న నాగేశ్వరరావు, ఈ చాంపియన్‌షిప్‌లో అద్భుత ప్రతిభతో మెడల్స్ సాధించారు. మంగళవారం కార్పొరేషన్ కార్యాలయలంలో ఇన్‌చార్జి కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావులను నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి మెడల్స్‌ను ప్రదర్శించారు.ఈ సందర్భంగా వారు నాగేశ్వరరావును అభినంచారు.

నేడే వేడుక..

- సత్యదేవుడి రాక కోసం ఎదురుచూస్తున్న రత్న సత్యగిరులు
- స్వామివెంట గిరిప్రదక్షిణలో పాల్గొననున్న రెండు లక్షల మంది భక్తులు
- సుమారు 8.5 కిలోమీటర్ల గిరియాత్ర
- ఉదయం 8 గంటలకు పల్లకీసేవ, మధ్యాహ్నం 2 గంటలకు సత్యరథంతో గిరిప్రదక్షిణ
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేసిన ప్రభుత్వం


గతేడాది గిరిప్రదక్షిణకు విచ్చేసిన అశేష భక్తజనం (ఫైల్‌ఫొటో)

అన్నవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి కోసం రత్నసత్యగిరి కొండలు ఎదురుచూస్తున్నాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే స్వామి వెంట నడిచే భక్తుల గోవిందనామస్మరణలతో పులకరించపోనున్నాయి. ఈ ప్రత్యేక కార్యక్రమాలకు కార్తీక పౌర్ణమి పర్వదినం ముఖ్య వేదిక కానుంది. ఏటా కార్తీకపౌర్ణమి నాడు కాకినాడ జిల్లా అన్నవరంలో గిరిప్రదక్షిణ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం కార్తీకపౌర్ణమి పర్వదినం పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం 8గంటలకు తొలిపావంచా వద్ద నుంచి స్వామివారి పల్లకీలో బాజాభజంత్రీలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ జాతీయరహదారి మీదుగా బెండపూడి పుష్కరకాలువ మీదుగా జరిగే గిరిప్రదక్షిణ యాత్ర సుమారు 8.5 కిలోమీటర్ల మేర సాగనుంది. ఇటీవల కాశీబుగ్గ ప్రమాద ఘటన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ యంత్రాంగాన్ని దేవదాయశాఖ అధికారులను ఆదేశించింది. దీనిలో భాగంగా ఇప్పటికే కాకినాడ జిల్లా ఎస్పీ గిరిప్రదక్షిణ మార్గాన్ని పరిశీలించారు. దేవదాయ శాఖ ప్రత్యేక అధికారిగా నియమించిన త్రినదరావు అన్నవరం దేవస్థానం ఈవో, చైర్మన్ ఇతర అధికారులతో గిరిప్రదక్షిణ రోడ్డు, అక్కడ భక్తులకు కల్పించేందుకు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. సుమారు 2లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో దానికణుగుణంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

12 చోట్ల పళ్లు, మజ్జిగ పంపిణీకి స్టాల్స్

12చోట్ల భక్తులకు పులిహోర, మజ్జిగ, పళ్ల స్టాల్స్‌ను దాతల సహకారంతో పంపిణీ చేయనున్నట్టు అధికారులు వివరించారు. పల్లకీ, సత్యరథం వెంబడి రోప్‌పార్టీతో బందోబస్తు చేపట్టనున్నారు. రథం జాతీయ రహదారిపైకి చేరే సమయంలో అరగంట ముందు భారీవాహనాలను నిలుపుదల చేసి చిన్నవాహనాలకు వన్‌వే ద్వారా మళ్లించాలని నిర్ణయించారు. ఎక్కడికక్కడ సైన బోర్డులు ఏర్పాటుచేయాలని, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ద్వారా భక్తులకు మార్గదర్శక సమాచారం ఇవ్వాలని కాకినాడ ఎస్పీ అధికారులకు సూచించారు.

భారీ బందోబస్తు

ఇన్‌చార్జి ఆర్డీవో మల్లిబాబు మాట్లాడుతూ గిరిప్రదక్షిణకు దేవస్థానం సిబ్బంది కాకుండా 724మంది పోలీసులు, 8 మంది సీఐలు, 16మంది ఎస్‌ఐలు, ఆరుగురు ఎమ్మార్వోలు, 20మంది వీఆర్వోలు భక్తులకు సేవలందిస్తారని తెలిపారు. గిరిప్రదక్షిణకు ప్రత్యేకాధికారిగా నియమించిన త్రినాధరావు దేవస్థానం సిబ్బందితో సమావేశమయ్యారు. ఉదయం, మధ్యాహ్నం గిరిప్రదక్షిణతో పాటుగా సత్యదేవుడి దర్శనానికి విచ్చేసే భక్తుల కోసం ఏర్పాట్లపై చర్చించారు. 1500 వ్రతాల నిర్వహణకు ప్రధానాలయం పక్కనే ఉన్న ప్రాకారం వద్ద అదనపు మండపాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. సాయంత్రం పంపా హారతులు, జ్వాలా తోరణం, కార్యక్రమాలన్నీ నిర్దేశించిన సమయానికి జరపాలని వైదిక కమిటీకి సూచించారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌జేసీ, ఈవో, చైర్మన్




సాలీడు... బాగుంది గూడు!



సాలీడులు అందంగా అల్లుకోవడం చూస్తూ ఉంటాం... కాకినాడ జిల్లా ఇంద్రపాలెం- సామర్లకోట రోడ్డులో మంగళవారం తెల్లవారుతుండగా... మంచుకురిసే వేళలో.. సాలీడు అందంగా అల్లుతున్న ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి కెమెరా క్లిక్ మనిపించిందిలా...

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

కపిలేశ్వరపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో పోక్సో కేసులో నిందితుడు షేక్ గౌస్ మొహిద్దీన్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. రామచంద్రపురం కోర్టుకు తరలించగా రిమాండ్ విధించినట్టు అంగర ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ మంగళవారం తెలిపారు. కపిలేశ్వరపురం మండలం నల్లూరుకి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన షేక్ గౌస్ మొహిద్దీన్ లైంగిక దాడికి పాల్పడ్డాడన్న ఆరోపణపై వారంరోజుల క్రితం పోక్సో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా డీఎస్పీ రఘువీర్ ఆదేశాలతో నిందితుడిని అరెస్ట్ చేసి రామచంద్రపురం కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారు.

వ్యక్తి మృతి కేసులో మహిళ అరెస్ట్

రాజమహేంద్రవరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరం రైల్వే స్టేషను సమీపంలోని జీఎస్‌ఆర్ లాడ్జిలో ఇటీవల ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆ కేసులో మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ శివగణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధవళేశ్వరానికి చెందిన ఉసురుమర్తి ధర్మరాజుకు విశాఖపట్నానికి చెందిన సత్య అనే మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ క్రమంలో లాడ్జిలో ధర్మరాజు మృతి చెందాడు. తొలుతగా అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవపరీక్ష, మృతుడి శరీరంపై గాయాల ఆధారంగా హత్యగా కేసుగా మార్పు చేశారు. ఈ కేసులో నిందితురాలైన సత్యను అరెస్టు చేశామని సీఐ శివగణేశ్ తెలిపారు.

గడ్డి మందు తాగి వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

అంబాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన వ్యాపారి కాసు శ్రీనివాసరావు (60) సోమవారం తన పొలంలో గడ్డి మందు తాగాడు. విషయాన్ని అల్లుడు శ్యామ్‌సుందర్‌కు ఫోన్ వివరించగా బంధువుల సాయంతో అమ లాపురంలోని ఆసుపత్రిలో చేర్పించారు. అయి తే పరిస్థితి విషమించడంతో కాకినాడలోని ఓ ప్రవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాసరావు మృతిచెందిన్నట్టు పోలీసులు తెలిపారు. బంధువులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ మూర్తి తెలిపారు.

శృంగారవల్లభస్వామి ఆదాయం రూ.37.23 లక్షలు

పెద్దాపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం తిరుపతి శృంగారవల్లభ స్వామి ఆలయంలోని హుండీల్లో కానుకులను మంగళవారం లెక్కించారు. 126 రోజులకు ప్రధాన హుండీల ద్వారా రూ.27,76,638, అన్నదాన హుండీ ద్వారా రూ.9,46,670... మొత్తం రూ.37,23,308 ఆదాయం సమకూరిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కె.నాగేశ్వరరావు, కాకినాడ డివిజన్ తనిఖీదారు వి.ఫణికుమార్, దేవస్థానం చైర్‌పర్సన్ మొయిళ్ల సంధ్య, తిరుపతి గ్రామ సర్పంచ్ మెయిళ్ల కృష్ణమూర్తి, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్ల ఎంపిక


అంబాజీపేటలో ఎంపికైన క్రీడాకారులు

అంబాజీపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట జిల్లా పరిషత్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-14 బాలుర, అండర్ -17 బాలికల ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్లను ఎంపిక చేశామని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె.ఈశ్వరరావు తెలిపారు. ఈ పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా మంగళవారం పరిశీలించారు. ఆర్ ఎస్ కుమార్, తోట రవి, ముత్యాల కిషోర్ జయరామ్, కుంపట్ల ఆదిలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన జట్ల ఎంపికకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కాకినాడ, రాజమహేంద్రవరం నుంచి 154 మంది బాలురు, 31 బాలికలు పాల్గొన్నారు. వారిలో అండర్-14 బాలుర, అండర్-17 బాలికల క్రికెట్ జట్లను ఎంపిక చేశామన్నారు. వీరు త్వరలో గుంటూరులో జరిగే స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారని ఈశ్వరరావు తెలిపారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో...

చోటు దక్కించుకున్న కాట్రేనికోన విద్యార్థి


కుషాల్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్ నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోని 195 దేశాల పేర్లు, వాటి రాజధానుల వివరాలను కేవలం 2 నిమిషాల 59 సెకన్ల 11 మిల్లీ సెకన్లలో చెప్పి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో విత్తనాల కుషాల్‌నాగవెంకట్ చోటు దక్కించుకున్నట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కాట్రేనికోన గ్రామానికి చెందిన కుషాల్ కామనగరువు ఢిల్లీ పబ్లిక్ స్కూలులో మూడో తరగతి చదువుతున్నాడు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌ను కలెక్టర్ మహేష్‌కుమార్ కుశాల్‌కు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఢిల్లీ పబ్లిక్ స్కూలు డైరెక్టర్ నంధ్యాల మనువిహార్, కోఆర్డినేటర్ వర్ధిని పాల్గొన్నారు.

14న ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న సత్తిబాబు

ముమ్మిడివరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఈనెల 14న జరగనున్న ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సత్తిబాబు పిలుపునిచ్చారు. జిల్లా కన్వీనర్ వాసంశెట్టి సత్తిరాజు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏఐటీయూసీ కోనసీమ జిల్లా సమావేశంలో సత్తిబాబు ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్మిక సంఘాల రెన్యువల్స్‌ను పూర్తిచేయాలని, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల జిల్లా మహాసభలు నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. కార్మిక సమస్యలపై వారు చర్చించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు, సబ్‌కమిటీ సభ్యుడు రాము పెద్దిరెడ్డి, శీలం వెంకటేష్, యు.వెంకటేష్, బండి సత్యనారాయణ, మోకా శ్రీనివాసరావు, బొలిశెట్టి గౌరీశంకర్, సంపర సుధ, బుంగా కుమార్, వనచర్ల విజయ్‌కుమార్, భవన నిర్మాణ కార్మికసంఘాల సభ్యులున్నారు.

భార్యను కాపురానికి పంపడంలేదని కత్తితో దాడి

తల్లీ, కూతుళ్లకు గాయాలు

ఏలేశ్వరం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన భార్యను కాపురానికి పంపడంలేదనే ఆగ్రహం చెందిన ఓ వ్యక్తి తల్లీకూతురిపై కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం ఎదురుపాక గ్రామానికి చెందిన పెంటకోట హరిబాబుతో కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం తిరుమాలి గ్రామానికి చెందిన రామకుర్తి సూరిబాబు అప్పలరాజుల రెండో కుమార్తె దుర్గాదేవిని ఇచ్చి వివాహం చేశారు. పెద్ద కుమార్తె నాగ దుర్గా సా యికి తిరుమాలికి చెందిన మణికంఠ స్వామితో వివాహం జరిగింది. ఏడాది కాలం నుంచి దుర్గాదేవి, హరిబాబు సంసారంలో కలతలు రేగాయి. అప్పటి నుంచి దుర్గాదేవి తన తల్లి ఇంటి వద్దే ఉండిపోతుంది. భార్యకు నచ్చచెప్పి తమతో పంపడంలేదని హరిబాబు ఆగ్రహంతో పించను కోసం తిరుమాలి వచ్చిన అత్త అప్పలరాజుపై దాడి చేశాడు. తప్పని అడ్డుకున్న వదినపై దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటనలో తీవ్రంగాగా యపడిన అప్పలరాజును, స్వల్పంగా గాయపడిన నాగ దుర్గా సాయిని స్థానికులు ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కేసును ఎస్‌ఐ రామలింగేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ సూర్య అప్పారావు తెలిపారు. హరిబాబును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని పోలీసులు తెలిపారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని వెల్లడించారు.


ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న తల్లీ,కూతురు

నమో నారసింహ..

- అంతర్వేదిలో వైభవంగా మహాశాంతి హోమం
- వేలాదిగా పాల్గొన్న భక్తులు


మహాశాంతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు


హోమం కోసం స్వామివారిని తీసుకెళ్తున్న అర్చకులు, అధికారులు

అంతర్వేది, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే శ్రీకర శుభకర ప్రణవస రూపుడు అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి. ఇటీవల వచ్చిన మొంథా తుఫాన్ నేపథ్యంలో రాజోలు నియోజకవర్గాన్ని, అంతర్వేది పరిసర ప్రాంతాలను కాపాడిన సందర్భంగా అంతర్వేదిలో మంగళ వారం మహాశాంతి హోమం వైభవంగా నిర్వహించారు. లక్ష్మీనరసింహస్వామికి భక్తి శ్రద్ధలతో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, కూటమి శ్రేణుల నేతృత్వంలో హోమాన్ని చేపట్టారు. అశేష భక్తజన సంద్రంతో పుణ్యక్షేత్రం కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, అయ్యప్పస్వాములు, భవానీ మాలధరించిన భక్తులు, క్షేత్రానికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు కాలినడకన పుణ్యక్షేత్రానికి చేరుకుని స్వామివారికి పాదాభివందనాలు చేస్తూ మొక్కారు. తొలుత స్వామిని అర్చకులు, ఆలయ అధికారులు శాస్త్రోక్తంగా ప్రధాన గోపురం ఎదురుగా ఉన్న కల్యాణ మండపంలో ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక హోమశాలలో శాంతి హోమాన్ని నిర్వహించి నృసింహ, గోవింద నామస్మరణల మధ్య మహశాంతి హోమం, పూర్ణాహుతి వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ కలిదిండి కుమారరామగోపాలరాజాబహదూర్, ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్ పూర్ణాహుతిలో పూజా ద్రవ్యాలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. తూర్పు, పశ్చిమ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు మహాశాంతిహోమాన్ని తిలకించారు. పూజా ద్రవ్యాలు హోమ గుండంలో వేసి స్వామిని దర్శించుకున్నారు. ఇంతటి మహోన్నతమైన కార్యక్రమం కార్తీకమాసంలో చేపట్టడంతో హర్షం వ్యక్తం చేసి నిర్వహకులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకెటీఎస్వీ ప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, కేతా వెంకటలక్ష్మి, ఆకన బాబ్జినాయుడు, పినిశెట్టి బుజ్జి, మాలే శ్రీనివాసనగేష్, గుబ్బల ఫణికుమార్, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, తిరుమాని ఆచార్యులు, సర్పంచ్‌లు కొండా జాన్‌బాబు, పోతురాజు కిశోర్, ఒడుగు శ్రీను, ఎంపీటీసీలు చొప్పల బాబూరావు, బైరా నాగరాజు, దాసరి వాసు, పిండి సత్యనారాయణ, వనమాలి మూలాస్వామి పాల్గొన్నారు.

స్టడీ రూంలో విద్యార్థి ఆత్మహత్య!

తునిలో కలకలం రేపిన సంఘటన


కార్తీక (ఫైల్)

తుని రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి మృతి చెందడం కలకలం రేపింది. తునిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తుని మండలం లోవ కొత్తూరు పంచాయతీ సీతయ్యపేట గ్రామానికి చెందిన కొంద్రు కార్తీక్ (15) సోమవారం రాత్రి స్కూల్ మేడ ఉన్న స్టడీ రూంలో ఉరేసుకుని మృతి చెందాడని విద్యార్థి తల్లిదండ్రులకు యాజమాన్యం సమాచారం అందించారు. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా తుని పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. స్కూల్ సిబ్బంది, స్టడీ రూమ్ అబ్జర్వర్‌తో మాట్లాడారు. సోమవారం సాయంత్రం వరకు కార్తీక అందరితోను సరదాగానే గడిపాడని... సాయంత్రం గదిలోనే ఉండిపోయాడని, స్టడీ అవర్‌కు రాలేదని కార్తీక స్నేహితులు, పాఠశాల యాజమాన్యం తెలిపినట్టు పోలీసులు తెలిపారు. ఆ సమయంలో ఏం జరిగిందో అనే దానిపై విచారణ చేపడుతున్నామని, విద్యార్థి మృతిని ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గీతారామకృష్ణ పేర్కొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

పరారీలో భర్త


దీనా (ఫైల్)

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యానాం బల్లవారివీధిలో వివాహిత అనుమానాస్పదంగా మృతిచెందింది. కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం గుత్తెనదివికి చెందిన పెమ్మడి దీనా (26), భర్త నానీ గత 4 నెలలుగా బల్లవారివీధిలో అద్దెకుంటున్నారు. కొంతకాలంగా వారి మధ్య గొడవలు జరగుతున్నాయి. దీనా ఇంట్లో టైలరింగ్ చేస్తుండగా భర్త నానీ పెయింటర్‌గా ఉన్నాడు. రోజూ ఉదయం ఇంటి మంచినీటి కుళాయి దీనా ఆన్ చేసేది. మంగళవారం ఉదయం6.30గంటలకు మంచినీటి మోటార్ వేయకపోవడంతో ఇంటి యాజమాని పనిమనిషినితో దీనాను నిద్ర లేపమని చెప్పింది. పనిమనిషి దీనా ఇంటి తలుపులు తోయగా దీనా రక్తపు మడుగులతో పడిపోయి ఉంది. పక్కనే దీన కుమార్తె పడుకుని ఉంది. వెంటనే సమీప రాజీవ్‌నగర్‌లో ఉంటున్న దీనా తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతిచెందిదని వైద్యులు ధ్రువీకరించారు. సంఘటనా స్థలాన్ని యానాం ఎస్పీ వరదరాజన్ పరిశీలించారు. ఎస్‌ఐ పూనిత్‌రాజా, కట్టాసుబ్బరాజు, క్లూస్‌టీంతో సంఘటనకు గల కారణాలను సేకరిస్తున్నారు. దీనాకు కుమార్తె 1వతరగతి చదువుతోంది. దీనా భర్త పరారీలో ఉన్నాడు. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీలో ఉంచారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో.. పెయింటర్ మృతి

- మరొకరికి తీవ్రగాయాలు
- మండపేట మండలం ద్వారపూడి శివారులో ఘటన


మరణించిన సూరిబాబు

మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి శివారు వేములపల్లి కాలనీ వద్ద మంగళవారం ఆటో బైక్‌ను ఢీ కొన్న ఘటనలో వ్యక్తి అక్కడికక్కడే మరణించగా మరో వ్యక్తి తీవ్రగాయాల పాలయ్యాడు. మండపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... మండపేట మండలం ఇప్పనపాడుకు చెందిన ఇందల దుర్గా సూరిబాబు (28) భవనాలకు పెయింటింగ్‌లు వేస్తుంటాడు. రాజానగరం మండలంలో నివాసం ఉంటున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం ఇంటి నుంచి తన పల్సర్ బైక్‌పై సహచరుడు రాజుతో కలిసి పెయింటింగ్ పని నిమిత్తం బయలుదేరాడు. ఇప్పనపాడు వస్తుండగా ద్వారపూడి పంచాయతీ పరిధిలో గల వేములపల్లి కాలనీ శివారు దూకుడు మెట్ట వద్దకు వచ్చేసరికి వేములపల్లి వైపు నుంచి రాజానగరం వైపు వెళ్తున్న ఆటో బైక్‌ను ఢీకొనడంతో బైక్‌పై నుంచి కిందకు పడిపోయిన సూరిబాబు తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మరణించాడు. రాజుకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. సూరిబాబు భార్య ఇందల జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మండపేట రూరల్ స్టేషన్ ట్రైనీ ఎస్‌ఐ సోమేంద్ర తెలిపారు. సూరిబాబు మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేస్తామని పేర్కొన్నారు.

గిరిజన ఆశ్రమ విద్యార్థిని అదృశ్యంపై కేసు


గంగాభాయ్

మారేడుమిల్లి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా మారేడుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థిని పల్లాల గంగభాయ్ పాఠశాలలో అదృశ్యమైంది. ఉపాధ్యాయులు మారేడుమిల్లి సీఐకు టి.గోపి సరేంద్ర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. గంగాభాయ్ మారేడుమిల్లి మం డలం చావడికోట పంచాయతీ చావడ కోట గ్రామం. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పింఛన్‌కు వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి...

దివ్యాంగుడి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పింఛన్ కోసం వచ్చి దివ్యాంగుడు మిగత జీవుడుగా మారాడు. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం... కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు బుద్దారపు శ్రీను (33) హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీ వద్ద సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. ప్రతి నెలా వచ్చే తన దివ్యాంగ పింఛను కోసం పెద్దిపాలెం వస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1న పెద్దిపాలెం వచ్చి పింఛను అందుకున్నాడు. అనంతరం బంధువుల ఇంటి వద్ద ఉండి స్థానిక ఏలేరు ఎడమ కాలువ వద్దకు సోమవారం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మునిగిపోయాడు. మంగళవారం ఉదయం మృతదేహం తేలడంతో స్థానికులు ప్రత్తిపాడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ లక్ష్మీకాంతం మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకిన యువతి


కళ్యాణి (ఫైల్)

యానాం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): యానాం ముఖద్వారం వద్ద గల యానాం-నీలపల్లి వంతెనపై నుంచి మంగళవారం రాత్రి గోదావరిలోకి యువతి దూకింది. పోలీసుల వివరాల మేరకు.. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండల పరిధిలోని జార్జిపేట పంచాయితీ తూర్పుపేటకు చెందిన సిరపు కళ్యాణి(25) తాళ్లరేవులో ఓ కిరాణా కొట్టులో పనిచేస్తుంది. తాళ్లరేవు నుంచి వచ్చిన ఆమె స్థానిక వంతెనపైకి చేరుకుని అక్కడ పర్సు, ఫోన్ వదిలి గోదావరిలోకి దూకింది. దీంతో అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చర్యలు చేపట్టారు.

1,819మంది రైతులకు పంట నష్టం

కాట్రేనికోన, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో మొంథా తుఫాన్‌కు 12 రెవెన్యూ గ్రామాల్లో వరి పంటకు నష్టం జరిగిందని వ్యవసాయాధికారి బి.మృదుల తెలిపారు. 1,819 రైతులకు సంబంధించి 1,794 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. ఇంకాఎవరికైనా నష్టం నమోదు కాకపోతే రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు పెట్టుకోవాలన్నారు.

వ్యక్తి అరెస్టు.. కోర్టుకు తరలింపు

అంతర్వేది, నవంబరు4(ఆంధ్రజ్యోతి): పాత గంజాయి కేసులో అంతర్వేది గ్రామానికి చెందిన నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపారు. గతంలో గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేశారు. ఇప్పుడు 200గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతడిని కోర్టుకు తరలించారు.

విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తితో శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఎంఈవో సరెళ్ల దుర్గాదేవి
- పలు పాఠశాలల్లో చెకుముకి పోటీలు

అమలాపురం రూరల్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తిని కలిగి శాస్త్రవేత్తలుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారిని సరెళ్ల దుర్గాదేవి అన్నారు. అమలాపురం మండలస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీలను అమలాపురం జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారిని సరెళ్ల దుర్గాదేవి ఈపోటీలను ప్రారంభించారు. చెకుముకి సైన్స్ సంబరాల పోటీలకు మండల, పట్టణ పరిధిలోని 8, 9, 10వ తరగతి విద్యార్థులను పాఠశాల స్థాయి నుంచి ఎంపికచేసి మండల స్థాయికి పంపించారు. ఈ పోటీల్లో మండలస్థాయిలో ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు డి.శ్యామ్‌కుమార్, ఎన్.మనీష, కామనగురువు ఆదిత్య ఉన్నతపాఠశాల విద్యార్థులు ఎన్.సాయిసంజన, పీబీ కార్తికేయ, బీఎస్ఎన్‌కే తపస్విని విజేతలుగా నిలిచారు. అర్బన్ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల స్థాయి నుంచి కొంకాపల్లి జవహర్‌లాల్ నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గుద్దటి రామ్‌సర్వేష్, కె.కార్తీక్, కె.శ్రీ మంజూష, ఆదిత్య హైస్కూలు గొల్లగూడెం నుంచి వి.గురుచరణ్, జి.అతిథి, టీఎస్ఎస్ కార్తీక్ విజేతలుగా నిలిచారు. వీరు ఈనెల23వ తేదీన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోటీల్లో పాల్గొంటారని కన్వీనర్లు బీఎస్ వెంకటేశ్వరరావు, డి.నాగేంద్రరాజు తెలిపారు. పాఠశాల హెచ్ఎం భమిడిపాటి రామకృష్ణ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎం.వెంకటేశ్వరరావు, కేవీఎస్ గౌడ్, పి.భాస్కరరావు, బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలు మలికిపురం ఏఎఫ్‌డీటీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బట్టేలంక ప్రథమ స్థానం, మేడిచర్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ద్వితీయ, ప్రైవేటు పాఠశాలల విభాగంలో భాష్యం పాఠశాల ప్రథమ, వివేకానంద పాఠశాల ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. ప్రతమ స్థానంలో నిలిచిన పాఠశాలలు నవంబరు 23న జరిగే జిల్లాస్థాయి సంబరాలకు హాజరు కావాలని నిర్వాహకులు తెలిపారు. ఈ సంబరాల్లో 14ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రైవేటు పాఠశాలలు పాల్గొన్నాయి. ప్రతీ పాఠశాలకు ఒక విద్యార్థికి చెకుముఖి మాసపత్రిక, ధ్రువపత్రం, విజేతలకు గిఫ్ట్ బుక్స్ మండల విద్యాశాఖాధికారి వైవీ సత్యనారాయణ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీవీ వరప్రసాద్, టి.చిట్టిబాబు, కె.సునీల్, ఎన్.రమేష్‌బాబు, ఆర్.రతన్‌రాజు, ఎం.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన చెకుముఖి పోటీల్లో విద్యార్థులు ఉల్లాసంగా పాల్గొన్నారు. మండలంలోని 19పాఠశాలలకు చెందిన 57మంది విద్యార్థులు ఈపోటీల్లో పరీక్షలు రాశారు. ఈపోటీలను ఎంఈవో మోకా వెంకన్నబాబు ప్రారంభించారు. ప్రైవేటు పాఠశాలల నుంచి మామిడికుదురు దీప్తి ఇంగ్లీషు మీడియం స్కూలు మొదటిస్థానాన్ని, నగరం సాయిదీప్తి స్కూలు రెండో స్థానాన్ని, ప్రభుత్వ పాఠశాలల నుంచి లూటుకుర్రు ఉన్నత పాఠశాల మొదటిస్థానాన్ని, పాశర్లపూడిలంక స్కూలు ద్వితీయ స్థానం సాధించాయి. విజేతలకు ఎంఈవో బహుమతులు అందించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక మండలాధ్యక్షుడు జి.నాగేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి సూరిమేను శ్రీనివాసరావు, ఇన్‌చార్జి హెచ్ఎం దొంగ సత్యనారాయణ, యూటీఎఫ్ కోశాధికారి సీహెచ్ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి సైన్స్ సంబరాలను మంగళవారం నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అనాతవరం ప్రభుత్వఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలవగా ప్రైవేటు పాఠశాలకు సంబంధించి ముమ్మిడివరం శ్రీబాలాజీ హైస్కూలు విద్యార్థులు ప్రథమ స్థానం సాధించారు. ఈ బృందం జిల్లాస్థాయిలో జరిగే చెకుముకి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు జనవిజ్ఞానవేదిక జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్యనారాయణ తెలిపారు. మండలస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన వారికి అర్హత సర్టిఫికెట్లను అందించారు.జనవిజ్ఞానవేదిక సభ్యులుపాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో స్కూల్ స్థాయి నైపుణ్య (స్కిల్) పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయిని కోసూరి ఉమాదేవి తెలిపారు. విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి ఈపోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను బహుమతులు అందించి అభినందించారు. అనంతరం మూడు విభాగాల్లో ఉత్తమ టీమ్స్ ఎంపిక చేసి విద్యార్థులను జిల్లా స్థాయికి పంపిస్తారు. కార్యక్రమంలో ఇంచార్జ్ లక్ష్మీదేవి, స్టాఫ్ సెక్రటరీ పి.దుర్గాప్రసాద్, ఎస్.కృష్ణ, ట్రైనర్స్ పి.దుర్గాప్రసాద్, ఎం.సచిన్, ఎం.తరుణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల కుటుంబాలకు తుఫాన్ సాయం

ప్రభుత్వ సాయం అందించిన నేతలు

అమలాపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా బండారులంక గ్రామంలో తీవ్రంగా నష్టపోయిన 750 చేనేత కార్మికుల కుటుంబాలు కూటమి ప్రభుత్వం నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టింది. అమలాపురం తహశీల్దార్ వాసా ఎస్.దివాకర్ ఆధ్వర్యంలో గ్రామంలోని చౌకధరల దుకాణాల ద్వారా ఆయా కుటుంబాలకు 50 కిలోల బియ్యం, కిలో కందిపప్పు, కిలో ఆయిల్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అంతేకాకుండా తీవ్రంగా నష్టపోయిన తుఫాన్ బాధిత కుటుంబాలకు, పునరావాసంలో ఉన్న బాధిత కుటుంబాలకు రూ.3వేలు చొప్పన ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు పిచ్చిక శ్యామ్, నాయకులు కొండా సత్యనారాయణరాజు, కాశిన బాబి, యాళ్ల నివాస్, మావూరి భాస్కర్, నల్లా సత్యానందం, కొండా కుమారస్వామి, ఏకుల విజయ్, గుమ్మిడి బ్రహ్మాజీ, యినుమర్తి సతీష్, గ్రామ రెవెన్యూ అధికారులు పల్లి రాంబాబు, ప్రకాష్, బేతాళస్వామి తదితరులు పాల్గొన్నారు.



అమలాపురం: బండారులంకలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాల పంపిణీలో శంకరమూర్తి, శ్యామ్

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల బాధితులైన విలసవిల్లిలోని 173చేనేత కార్మిక కుటుంబాలకు మంగళవారం బియ్యం, నిత్యావసర వస్తువులను సర్పంచ్ సలాది ఊర్మిళాసతీష్ పంపిణీ చేశారు. సలాది సతీష్, ఆర్ఐ నాగూర్‌మీరాసాహెబ్, వీఆర్వో కోటిపల్లి వెంకటరమణ పాల్గొన్నారు. గొల్లవిల్లిలో జరిగిన బియ్యం పంపిణీలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గా చిన్నా, సొసైటీ చైర్మన్ మంచెం బాలకృష్ణ, సలాది నాగరాజు, సీఈవో మంచెం బాబి, వీఆర్వో వి.ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. పేరాయిచెరువులో జరిగిన కార్యక్రమంలో పెయ్యల దుర్గారావు, మధుర సత్యనారాయణ, పెయ్యల చిట్టిబాబు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): గోడి పంచాయతీ పరిధిలో తుఫాన్ బాధిత కుటుంబాలకు క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు రాజు బియ్యం, కూరగాయలు, నిత్యవసరాలను పంపిణీ చేశారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేలు సాయం ప్రకటించిందన్నారు. గోడి సర్పంచ్ తోట శ్రీదేవినరసింహారావు, ఎంపీటీసీ కాండ్రేగుల వాణీఅచ్యుతం, వీఆర్వో శ్రీనివాస్, జనసేన నాయకుడు బండారు శ్రీను పాల్గొన్నారు. మొగళ్లమూరు పంచాయతీ శిరగట్లపల్లిలో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు, 50కిలోల వంతున బియ్యాన్ని పంపిణీ చేశారు. సర్పంచ్ రాయుడు విష్ణు త్రిమూర్తులు, టీడీపీ నాయకుడు అల్లు సత్తిబాబు, జనసేననాయకుడు సాధనాల చినసత్యనారాయణ, లూటుకుర్తి చిన్నా పాల్గొన్నారు.

అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి



అమలాపురం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల నిరసన ప్రదర్శన

అమలాపురంటౌన్,నవంబరు4(ఆంధ్రజ్యోతి): ఐ.పోలవరం మండలంలో బాలికపై అత్యాచారం చేసిన రాయపురెడ్డి బాబిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో విద్యార్థినులు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఐద్వా ఆధ్వర్యంలో స్థానిక నల్లవంతెన వద్దనున్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల భద్రత, లైంగిక వేధింపుల నుంచి తమను తాము రక్షించుకోవడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం బాలికపై జరిగిన అత్యాచారాన్ని ఖండిస్తూ నిందితుడు బాబిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు.ఐద్వారా జిల్లా అధ్యక్షురాలు జి.దైవకృప, బళ్ల భువనేశ్వరి, విద్యార్థినులు పాల్గొన్నారు. ఆడపిల్లల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.

ఓటరు దరఖాస్తుల పంపిణీ

యానాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యానాంలో ఓటరు గణన దరఖాస్తుల పంపిణీ కార్యక్రమాన్ని యానాం ఓటర్ల నమోదు అధికారి, ప్రాంతీయ పరిపాలనాధికారి అంకిత్ కుమార్ ప్రారంభించారు యానాం శివారు సావిత్రినగర్‌లో దరఖాస్తులను ఓటర్లకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల4 నుంచి డిసెంబరు 4వరకు నియోజకవర్గంలో ఉన్న 33 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్లకు దరఖాస్తులు పంపిణీ చేస్తారన్నారు. గైర్హాజరు, మార్పిడి, మరణించిన, నకిలీ ఓటర్ల వివరాలను సేకరిస్తారన్నారు. 2026 జనవరి ఒకటో తేదీ నాటికి 18ఏళ్లు దాటిన వారందరికీ బీఎల్‌వోలు ఫారమ్-6ను అందిస్తారన్నారు.

'యానానికి క్రీడా సదుపాయాలు కల్పించండి'



మంత్రి మునీష్క మాండవియతో చర్చిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యానానికి కేంద్ర ప్రభుత్వ నుంచి క్రీడా సదుపాయాలు కల్పించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. కేంద్ర క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ మంత్రి మునిష్క మాండవియాతో మల్లాడి సమావేశమయ్యారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం యానానికి సంబంధించిన క్రీడా పెండింగ్ అంశాలపై వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం శాఖలో ప్రస్తుతం ఉన్నరెండు విభాగాలతో పాటు గతంలో ఉండే వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ విభాగాలను ఏర్పాటుచేయాలన్నారు. డే స్పోర్ట్స్ శిక్షణ తీసుకునేందుకు స్థానిక బాలురు, బాలికలకు అవకాశం ఇవ్వాలన్నారు. ఖోఖో, కరాటే, తైక్వాండో, అథ్లెటిక్స్ విభాగాలు యానాంశాఖలో ఏర్పాటుచేయాలన్నారు. స్విమ్మింగ్‌పూల్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు రూ.2.5కోట్లు కేటాయించాలని కోరారు. యానాంలోని మెట్టకుర్రు, సావిత్రినగర్, దరియాలతిప్పలో క్రికెట్ గ్రౌండ్ అభివృద్ధి పనులకు రూ.3కోట్లు కేటాయించాలని, గిరియాంపేట కళాశాల సమీపంలో 400మీటర్ల రన్నింగ్ ట్రాక్‌కు రూ.4కోట్లు, సావిత్రినగర్, కనకాలపేట, దరియాలతిప్ప, గిరియాంపేటల్లో ఉన్న మినీ ఇండోర్ స్టేడియాలకు ఉడెన్ కోర్టు తదితర అభివృద్ధి పనులకు రూ.3 కోట్లు కేటాయించాలని కోరారు. ఈఅంశాలపై మంత్రి మాండవియా సానుకూలంగా స్పందించి త్వరలోనే నిధులు విడుదలకు చర్యలు తీసుకోకుంటానని మల్లాడికి హామీ ఇచ్చారు.

వీల్‌చైర్స్ బహూకరణ

ఐ.పోలవరం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయానికి విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ అమలాపురం శాఖ రెండు వీల్‌చైర్స్ బహూకరించారు. సహాయ సంచాలకుడు అయ్యలసోమయాజుల శ్రీనివాస్ మంగళవారం వీల్‌చైర్స్‌ను ఆలయ సిబ్బందికి అందించారు. వీల్‌చైర్స్ బహూకరించిన దాతలను ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అభినందించారు.

దోమల నివారణకు చర్యలు

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మురిగి గుంటల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ ఉపయోగపడతాయని లూటుకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.సత్యవతి పేర్కొన్నారు. మామిడికుదురు దీప్తి కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఐదో రోజు మంగళవారం మాకనపాలెం, కొమరాడ గ్రామాల్లో గల మురికిగుంటలు, కాల్వల్లో పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆదేశాల మేరకు ఆయిల్ బాల్స్‌ను విడిచిపెట్టారు. కళాశాల కరస్పాండెంట్ డీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరగ్గా సచివాలయ సిబ్బంది, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆమరణ దీక్ష

ముమ్మిడివరం, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో బస్టాండు ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారంతో 25వ రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని మొసలి శ్రీనివాసరావు, మాగాపు నాగరాజు, గోడి సత్యనారాయణలు సందర్శించి సంఘీభావం తెలిపారు. అయితే సాయంత్రం తర్వాత రవికుమార్ ఆమరణ దీక్ష చేపట్టారు.

తుఫాన్‌తో ఇబ్బంది పడ్డాం.. సహాయం అందించండి



ధర్నా చేస్తున్న కృష్ణశర్మ కాలనీ మహిళలు

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడ్డామని, తమకు కూడా సాయం అందించాలంటూ పాశర్లపూడి కృష్ణశర్మ కాలనీ ప్రాంత మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాల్లో ఉన్న వారికే సహాయం అందిస్తారా, తమకు అందివ్వరా అంటూ మహిళలు తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల్లో తప్ప ప్రకృతి వైపరీత్యాలు వచ్చినప్పుడు గుర్తుకు రామా అంటూ నిరసన తెలిపారు. స్థానిక నాయకులు, అధికారులు తమను పట్టించుకోలేదని, బాధితులందరికీ న్యాయం చేయాలని, ఆర్థికసాయంతో పాటు నిత్యావసరాలు అందించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కంతశెట్టి వెంకటలక్ష్మి, సారిక జ్యోతి, పలివెల లక్ష్మి, కంతశెట్టి మంగ, కడలి ఎర్రమ్మ పాల్గొన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా నల్లా

ఉప్పలగుప్తం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా నల్లా సత్తిబాబు నియమితులయ్యారు. మంగళవారం బీజేపీ సీనియర్ నాయకుడు ఆర్.వి.నాయుడు సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వరదా రాము, ప్రధాన కార్యదర్శిగా జంపన సూరపరాజు, కార్యదర్శులుగా చల్లా దుర్గాప్రసాద్, నవుండ్రు నరేష్, పెదపట్నం వెంకటరత్నం, కోశాధికారిగా కంకటాల గుప్త ఎన్నికయ్యారు. బీజేపీ నాయకులు మండలంలో పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి అరవింద్ పాల్గొన్నారు.

ఆడియో లీక్ చేసిందెవరు!

అమలాపురం రూరల్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్(37) హత్య కేసులో ప్రధానంగా భావిస్తున్న ఆడియోను లీక్ చేసింది ఎవరనే అంశంపై పోలీసులు దృష్టి సారించారు. ఒకే వర్గంగా ఉంటూ కలిసి వ్యాపారాలుచేసి సకాలంలో సొమ్ములు చెల్లించకపోవడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందని పోలీసులు భావిస్తున్నారు. శ్రీనివాస్ హత్యకేసులో ప్రధాన నిందితుడైన గంగుమళ్ల షణ్ముకేశ్వరరావు అలియాస్ కాసుబాబు, మరో రౌడీషీటర్ కలిసి చేసిన వ్యాపారంలో నగదు లావాదేవీల వ్యవహారంలో వివాదం తలెత్తినట్టు తెలిసింది. అప్పటివరకు కలిసి ఉన్న సదురు రౌడీషీటర్ శ్రీనివాస్‌తో ఫోన్ చేయించినట్టుగా భావిస్తున్నారు. ఫోన్‌లో జరిగిన సంభాషణలు, అంతకుముందు ఆ తరువాత ఫోన్లలో ఎవరెవరు ఎవరితో మాట్లాడారనే అంశాలపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే ఆంధ్రజ్యోతిలో ఆడియో లీకే హత్యకు కారణమా అని ముందుగానే చెప్పింది. అదేవిధంగా శ్రీనివాస్ హత్యకు ఆడియో లీకే ప్రధాన కారణంగా పోలీసులు భావిస్తున్నట్టు ఇప్పటికే తెలిసింది. అయితే ఈకేసులో ప్రధాన నిందితులైన గంగుమళ్ల కాసుబాబు, అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, కారుడ్రైవర్ భాస్కర్ల ప్రసాద్, రావులపాలేనికి చెందిన అనిల్ పోలీసుల అదుపులో ఉన్నారని సమాచారం. కానీ పోలీసులు ఇంత వరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని చెబుతున్నారు. పి.గన్నవరం సమీపంలో హత్య జరిగిన ప్రాంతాలపై పోలీసులు దృష్టి సారించి విచారణ చేపట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో ఈ కేసు వ్యవహారాన్ని పోలీసులు బయటపెట్టే అవకాశం ఉంది.

15న కాపు కార్తీక వనసమారాధన

అమలాపురంటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఈనెల15న అమలాపురం గండువీధిలోని డాక్టర్ మెట్ల సత్యనారాయణరావు కల్యాణ మండపంలో కార్తీక వనసమారాధన నిర్వహిస్తున్నారు. తెలగ అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మెట్ల రమణబాబు స్వగృహం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈనెల15న జరిగే వనసమారాధనకు సంబంధించిన కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నల్లా స్వామి, మున్సిపల్ మాజీ చైర్మన్ చిక్కాల గణేష్, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు, చిక్కం పెదబాబు, బోనం సత్తిబాబు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్యవైశ్య కార్తీక వనసమారాధన

అమలాపురంటౌన్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): అమలాపురంవాసవికన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం కార్తీక వనసమారాధన కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. తొలుత మెయిన్ రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలోఉన్న ఉసిరి చెట్టు వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం జరిగిన వనసమారాధనలో 2500 మంది సంఘీయులు పాల్గొన్నారు. వైశ్యసంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరి నరేష్, కోశాధికారి కొమ్మూరి ప్రసాద్, సమారాధన కమిటీ చైర్మన్ పిన్నంశెట్టి కుమార్, కోచైర్మన్ బోణగిరి పంచముఖి, చక్కా ప్రవీణ్, కోశాధికారి నిట్టాల శ్రీరామ్ సేవలందించారు.

తుఫాన్ బాధితులకు ఒడిశా రెడ్‌క్రాస్ వితరణ



అమలాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు ఒడిశా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ బ్రాంచి నుంచి కంటైనర్ మంగళవారం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంది. కలెక్టర్ మహేష్‌కుమార్ ఈవాహనాన్ని పరిశీలించారు. ఒడిశా ఇండియర్ రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా తుఫాన్ బాధితులకు 1500 టార్పాలిన్లు, వెయ్యి ప్లాస్టిక్ బకెట్లు, మగ్గులు, ఉలెన్ దుప్పట్లు 600, 10వేల పండ్ల జ్యూస్ ప్యాకెట్లు పంపించినట్టు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు దశరథ రామారావు, ఒడిశా బ్రాంచి జాయింట్ సెక్రటరీ అశోక్‌కుమార్ మహంతి, స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అక్షరాంధ్ర శిక్షణ

అల్లవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అల్లవరం వెలుగు కార్యాలయంలో అక్షరాంధ్ర (ఉల్లాస్) వలంటీర్ టీచర్స్ మండలస్థాయి శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో గౌరీకుమారి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాజామణి, ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్‌పై కాశీ యాత్ర



ఐ.పోలవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జి.మూలపొలానికి చెందిన నలుగురు భక్తులు సైకిల్‌పై కాశీ యాత్రకు శ్రీకారం చుట్టారు. కాశీ విశ్వనాధుని దర్శించుకునేందుకు జి.మూలపొలానికిచెందిన కుక్కర్లగడ్డ సుబ్రహ్మణ్యం, మేడ శ్రీను, రేకాడి వీరబాబు, పినపోతు రాజు మంగళవారం సైకిళ్లపై కాశీ యాత్రకు బయలుదేరారు. 30రోజులు ప్రయాణించి కాశీ చేరుకోనున్నట్టు వారు తెలిపారు. ప్రముఖ ఆర్ఎంపీ వైద్యుడు రెల్లు గంగాధరం, గ్రామస్తులు, కుటుంబ సభ్యులు కాశీ యాత్ర దిగ్విజయం కావాలని దీవించారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పెనమంట్ర మండలం నెగ్గిపూడి గ్రామానికి చెందిన తాడి వెంకటశ్రీనివాసరావు మంగళవారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామివారికి 1,108 కొబ్బరికాయల మొక్కును చెల్లించుకుని విఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళంగా అందజేశారు. వీరికి ప్రధాన అర్చకులు వేదఆశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించి అభినందించారు.

మంత్రిని కలిసిన గుబ్బల ఫణి

అంతర్వేది, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయవాడ గొల్లపూడి బీసీ భవన్‌లో బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత అధ్యక్షతన బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో చైర్మన్ రెడ్డి అనంతకుమారితో కలిసి బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్ పాల్గొని పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆదరణ పథకం మూడో విడత ద్వారా లబ్ధిదారులకు ఏవిధంగా పథకాలు రూపొందిస్తే ఆ కార్పొరేషన్లకు లబ్ధి చేకూరుతుందనే విషయాలపై చర్చించినట్టు గుబ్బల ఫణికుమార్ తెలిపారు.

బీవీసీ ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

అల్లవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం సచివాలయం వద్ద ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం నిర్వహించారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులతో అవినీతిని నిర్మూలిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అవినీతి నిర్మూలనలో యువత ముందుకు రావాలని ముఖ్య అతిథి, బీజేపీ నాయకుడు యాళ్ల దొరబాబు, ఎస్‌బీఐ మేనేజర్ రవి పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి అవినీతి నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి చిక్కం శ్రీనివాస్, కె.ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సలాది తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు. బీవీసీ అధినేత బోనం కనకయ్య, చైర్‌పర్సన్ బోనం కనకదుర్గ, ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.ప్రవీణ్‌లు వీరిని అభినందించారు.

గురుకుల కళాశాలలను సందర్శించిన మోనటరింగ్ కమిటీ

అల్లవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గోడి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకుల కళాశాలల హాస్టళ్లను ఎస్సీఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ జిల్లా సభ్యులు పుణ్యమంతుల రజనీ, వెంట్రు సుధీర్‌లు సందర్శించారు. చిన్నారుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని లైంగిక దాడులకు పాల్పడడం శోచనీయమన్నారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. గురుకులాల హాస్టళ్లను వారు తనిఖీ చేశారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారం అందించాలని కోరారు. కటికదల రమణ, బొంతు కుమారి, కోరుకొండ రవి పాల్గొన్నారు.

వీరవేణు కుటుంబానికి సాయం

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ బాధితులను ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుందని నాయీబ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం పేర్కొన్నారు. తుఫాన్ ప్రభావంతో తాడిచెట్టు పడి వీరవేణు మరణించగా కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. తనవంతు సాయంగా రూ.5వేలను అందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కొరుప్రోలు నూకరాజు, వై.ఏసు, లంక రత్నారావు, సుందరపల్లి గోపాలకృష్ణ, ఎం.నాగసత్యనారాయణ, మానుకొండ దుర్గాప్రసాద్, ర్యాలి లోవరాజు, ఆర్.శ్రీను, ఎస్.సుబ్బారావుపాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఐ.పోలవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): బాణాపురం అత్యాచార బాధిత బాలిక కుటుంబానికి వైసీపీ లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించింది. వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి సహాయం అందించారు. గృహ నిర్మాణానికి, పిల్లల చదువుకు సహాయం అందిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పితాని బాలకృష్ణ, మండల కన్వీనర్ పిన్నమరాజు శ్రీనురాజు, సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, పెన్మెత్స వాసురాజు, కొర్లపాటి ప్రసాద్ పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ ప్రతినిధులు

యానాం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్ధాని దినేష్ ఆధ్వర్యంలో నాయకులు కాటంశెట్టి రామ్మూర్తి తదితరులు పుదుచ్చేరి వెళ్లి పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కైలాస్‌నాథన్‌ను కలిశారు. అనంతరం వారు మాట్లాడుతు యానాంలో 25సంవత్సరాల్లో ఉన్న ఫ్యాక్టరీలన్నీ పోయ్యాయని, యానాంలో యువత నిరుద్యోగులుగా ఉంటున్నారని కోరారు. యానాంలో ఉన్న బొటానికల్ గార్డెన్స్, ఐఫిల్‌టవర్, దరియాలతిప్ప వాక్‌బ్రిడ్జి సరిగా ఉపయోగంలో లేవని, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని దీనిపై విచారణజరిపి అభివృద్ధి చేయాలని కోరారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో అప్లికేషన్ డెవలప్పర్ వెబ్, ఫోన్ ఇండస్ట్రియల్ ఎలక్ట్రీషియన్ కోర్సులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డి.హరిశేషు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల15వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదివిన అభ్యర్థులు ఆయా కోర్సులకు పేర్లు నమోదుచేసుకోవచ్చన్నారు. వివరాలకు 8341648470ను సంప్రదించాలన్నారు. పదో తరగతి సర్టిఫికెట్ జిరాక్సు, ఆధార్ జిరాక్సు, రెండు పాస్ పోర్టు ఫొటోలు జత చేయాలన్నారు.

9న యెరుబండి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం

మామిడికుదురు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): యెరుబండివారి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం ఈనెల9న వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈదరాడలోని శివాలయం వద్ద మంగళవారం సమావేశం నిర్వహించారు. యెరుబండి ఇంటిపేరు కలిగిన వారందరూ ఈఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. వాడపల్లి, పలివెల గ్రామాలకు చెందిన యెరుబండి వారి ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

వీఏ అసిస్టెంట్ పరీక్ష ఫలితాలు విడుదల

యానాం, నవంబరు 4(అంధ్రజ్యోతి): పుదుచ్చేరి రెవెన్యూశాఖలో ఖాళీగా ఉన్న వీఏ అసిస్టెంట్, ఎంటీఎస్ పోస్టుల భర్తీకి సంబంధించి ఫలితాలను పుదుచ్చేరి ప్రభుత్వం విడుదల చేసింది. వీరిలో యానానికి సంబంధించి ఏడుగురు ఎంపికయ్యారు. వీరిలో దీపిక చింతాకుల, షబీర్ షేక్, సయ్యద్ అన్‌సార్, లక్ష్మీ ప్రియాంక, చక్రవర్తుల దేవి హరిత ప్రసాదిని, కోటారి సత్య వసంత దేవి, పేరబత్తుల నాగాబుషణం ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రాజు ఎంపిక

మలికిపురం, నవంబరు4(ఆంధ్రజ్యోతి): కాకినాడలో సోమవారం జరిగిన స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ఇండియా గేమ్స్ జిల్లాస్థాయిపోటీల్లో షాట్‌పుట్‌లో పడమటిపాలెం పాఠశాలకు చెందిన బి.రాజు ద్వితీయస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్ఎస్ఎస్ శర్మ తెలిపారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.


పసలపూడిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట

రాయవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం పసలపూడి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి భూమిపూజ, అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని హామీలను అమలు చేయడంతో పాటు పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ, సీసీ రోడ్డును ప్రారంభించారు. కార్యక్రమంలో రామచంద్రపురం వాటర్ డీసీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కడలి పద్మావతి, సహకార సంఘం త్రిసభ్య కమిటీ ఛైర్మన్ సత్తి వెంకట కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి, టీడీపీ అమలాపురం పార్లమెంట్ ఉపాధ్యక్షుడు వైఆర్కే పరమహంస, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సతీష్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కాదా ప్రభాకరరావు, టీడీపీ నాయకులు అనుసూరి శ్రీను, ఉప సర్పంచ్ సాయి రామ్మోహనరెడ్డి, ఎంపీటీసీ కర్రి విజేత, మాజీ ఎంపీటీసీ నల్లమిల్లి వెంకన్నబాబు, రిమ్మలపూడి వేణుగోపాలదొర, మాజీ సర్పంచ్ నూనె ఏసుబాబు, పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపుంతకాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

మండపేట, నవంబరు, 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందించిన గొల్లపుంతకాలనీ వాసులకు నేటి వరకు మౌలిక వసతులు కల్పించటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు ఆరోపించారు. కాలనీలో 2000 మంది ఇళ్లను నిర్మించుకుని ఉంటున్నారన్నారు. వారు కాకుండా మరో నాలుగు వేల టిడ్కో గృహాల్లో లబ్ధిదారులు ఉంటున్నారని అన్నారు. ఇప్పటి వరకు కాలనీలో కనీస వసతులు కరువయ్యాయని ఆయన తెలిపారు. 2008లో అప్పటి సీఎం వైఎస్, ఆలమూరు ఎమ్మెల్యే కృష్ణార్జున చౌదరి కృషితో అందించిన స్థలాల్లో ఇళ్లను నిర్మించుకున్నప్పటికి నేటికి కాలనీవాసులకు పార్కు, ఆటస్థలం వైద్య వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలనీ సమస్యలపై దృష్టిసారించి మౌలిక వసతులు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నిందితుడికి వారం జైలు

రాయవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఒకవ్యక్తికి వారం రోజులు జైలు విధిస్తూ అనపర్తి జేఎఫ్‌సీఎం తీర్పు ఇచ్చిందని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ డంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన నిందితుడి సయ్యద్ కరీముల్లాకు వారంపాటు జైలుశిక్ష విధిస్తూ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారన్నారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా శిక్ష తప్పదని ఎస్ఐ హెచ్చరించారు.

రామచంద్రపురం జట్ల ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో అండర్ 14, 17 బాల బాలికల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ జట్ల ఎంపికలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ రామచంద్రపురం ఇన్‌చార్జి అని శ్రీనివాస్ తెలిపారు. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, కపిలేశ్వరపురం, మండపేట మండలాల నుంచి మొత్తం 350 మంది బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి పర్యవేక్షణలో ఈ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల ఇన్‌చార్జి సీహెచ్ లక్ష్మీశ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, వీర్రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు అనురాధ, కృష్ణమోహన్, వి.నాగార్జున, కె.నాగార్జున, రాఘవ, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

మంచినీటి సరఫరాకు నేడు అంతరాయం

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట బస్టాండ్ వద్ద మున్సిపల్ మెయిన్ వాటర్ పైపులైన్‌కు మరమ్మతులు రావడంతో బుధవారం మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రంగారావు చెప్పారు. గురువారం మంచినీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని ఒక ప్రకటనలో తెలిపారు.

పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించొద్దు

ఆలమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దని జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ సూచించారు. చొప్పెల్లలో మంగళవారం పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన పలు వీధుల్లో పారిశుధ్యం, ఇంటింటికి తడిపొడి చెత్త సేకరణ, చెత్త నుంచి సంపద సేకరణ కేంద్రాలను ఆయన పరిశీలించారు. నేరుగా ఇంటింటికి వెళ్లి మహిళలతో చెత్త సేకరణపై వివరాలు తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులపై స్థానిక ఎంపీడీవో ఎ.రాజుతో ఆయన చర్చించారు. డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్ వెంట ఎంపీడీవోతో పాటు, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


చొప్పెల్లలో పారిశుధ్య పనుల నిర్వహణపై చర్చిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్


టిడ్కో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్ రంగారావు

టిడ్కో గృహాల ఫేజ్2 పనులను సత్వరమే పూర్తి చేయాలి

కమిషనర్ రంగారావు

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేటలోని గొల్లపుంతలో నిర్మించిన టిడ్కో ఫేజ్-2 గృహాల సముదాయంలోని పెండింగ్ పనులను సత్వరమే పూర్తిచేసి డిసెంబరుకల్లా లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. మంగళవారం మండపేట మున్సిపల్ కార్యాలయంలో ఆయన టిడ్కో, మున్సిపల్, మెప్మా సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు చేశారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ కె.శ్రీనువాస్, ఏఈలు, పవన్ అనూష, టిడ్కో ఏఈ వివేక్, బిందు, మెప్మా సిఎంఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపారాధన ఏర్పాట్ల పరిశీలన

ఆత్రేయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అన్నవరం కార్తీకమాస దీపారాధన కార్యక్రమానికి వాడపల్లి ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ప్రత్యేక విధులను అప్పగించారు. రెండు రోజుల నుంచి అన్నవరంలో పర్యటించి ఆయా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కార్తీకపౌర్ణమి గిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో భాగంగా దీపారాధన ప్రదేశంలో స్టాండ్లను ఆయన సిబ్బందితో పర్యవేక్షించారు.

ర్యాలి కేశవస్వామి ఆలయంలో అన్నమాచార్య సేవా ట్రస్టు డైరెక్టర్ పూజలు

ఆత్రేయపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో మంగళవారం టీటీడీ తెలంగాణ అన్నమాచార్య సేవా ట్రస్టు డైరెక్టర్ పి.మీనాక్షి శ్రీనివాస్ స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వారికి ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణ మూర్తి స్వామివారి చిత్రపటం, శేష వస్త్రం అందజేశారు.



టీటీడీ అన్నమాచార్య సేవా ట్రస్టు డైరెక్టర్‌కు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

స్వదేశీ వస్తువులనే ఉపయోగిద్దాం

కొత్తపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆత్మ నిర్భర్‌లో భాగంగా స్వదేశీ వస్తువులను వినియోగించుకుందామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం కోరారు. మంగళవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు అధ్యక్షతన ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలూరి జయప్రకాశ్ నారాయణ, కోటిపల్లి దామోదర్, వల్లభశెట్టి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా స్వదేశీని విజయవంతం చేయాలి

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇంటింటా స్వదేశీ నినాదాన్ని నెరవేర్చేందుకు కార్యకర్తలు పనిచేయాలని భారతీయ జనతా పార్టీ అనకాపల్లి ఇన్‌ఛార్జ్ కర్రి చిట్టిబాబు, మండల ఇన్‌ఛార్జ్ రాఘవేంద్ర అన్నారు. మంగళవారం అముజూరులో బీజేపీ నాయకులు సమావేశమయ్యారు. ప్రధాని మోడీ నినాదాన్ని విజయవంతం చేయడంపై చర్చించారు. వీటికి సంబంధించిన స్టిక్కర్లను ఇంటింటా అతికించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అవసరాల రమణమూర్తి, కొప్పిశెట్టి చంద్రరావు, గుర్రాల సత్యనారాయణ, సలాది శేఖర్, సలాది రామకృష్ణ, తోట నాగబాబు, పిల్లి కిరణ్‌కుమార్, నారాయణమూర్తి, నున్న సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం

మండపేట, నవంబరు, 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నిరాశ్రయులైన పేదలకు ప్రభుత్వసాయాన్ని మంగళవారం కూటమి నాయకులు బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేశారు. పట్టణంలోని రేషన్ దుకాణం 15 వద్ద 11 మంది బాధితులకు బియ్యం, నిత్యావసర వస్తువులను 23, 24 వార్డుల ఇన్‌చార్జిలు టీడీపీ సీనియర్ నాయకుడు బొడ్డు రామకృష్ణ, కడియాల వెంకటలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకుడు కె.సత్యనారాయణ, జె.సూర్యారావు వీఆర్‌వోల సమక్షంలో అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చింతల శ్రీనువాస్, కడియాల గోవిందు, పలువురు రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.


మొంథా తుఫాన్ బాధితులకు ప్రభుత్వ సాయం అందజేస్తున్న కూటమి నేతలు

ఆక్రమణల తొలగింపుపై సమావేశం

రావులపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ మీటింగ్ హాలులో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఆక్రమణల తొలగింపుపై సమావేశం నిర్వహించారు. దీనికి ఆర్ఐ రవికుమార్, రావులపాలెం టౌన్ సీఐ శేఖర్ బాబు, కార్యదర్శి దుర్గాప్రసాద్, ఐఎం మేనేజర్ రమేష్, ప్రాజెక్టు మేనేజర్ కోట మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి రావులపాలంలోని రింగ్‌రోడ్డు, సర్వీస్ రోడ్లలో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు హాజరయ్యారు. అధికారులు మాట్లాడుతూ ఆక్రమణల కారణంగా ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలపై చర్చించారు. ఆక్రమణల తొలగింపు 7వ తేదీలోపు స్వచ్ఛందంగా చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకోవడానికి వారు అంగీకరించినట్లు అధికారులు తెలిపారు.

జనమన్ పథకంపై అవగాహన

రావులపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రావులపాడు పంచాయతీ పరిధిలోని ఎస్టీలకు ప్రధానమంత్రి జనమన్ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ మట్టా సత్యాదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ అక్కడ నివసిస్తున్న షెడ్యూల్ తెగల కుటుంబాలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో నాయకులు పెచ్చెట్టి చిన్నారావు, నెక్కంటి వెంకన్న, ఎంపీటీసీ గిడ్ల ఆశ, కిషోర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



కుండపోత వర్షం

రావులపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో కుండపోత వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం నాలుగు గంటల ప్రాంతం నుంచి గోపాలపురం, ముమ్మిడివరప్పాడు, ఈతకోటతో పాటు పలు ప్రాంతాల్లో రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో నేలకొరిగిన వరి పంట పొలాల్లోకి వర్షం నీరు చేరడంపై రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

రేషన్ బియ్యం సీజ్

రావులపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ ఉంచిన 50 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసినట్టు రావులపాలెం టౌన్ సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... రావులపాడులో పెట్రోల్ బంకు సమీపంలో రేషన్ బియ్యం ఉన్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో 50 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి కర్రి రామిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

వరికోతల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి పొలాల్లో నీరు తొలగించిన తరువాత కోతలు ప్రారంభించాలని వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్ రైతులకు సూచించారు. మంగళవారం యండగండి, పామర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి, వీఏఏలు హరిబాబు, శ్రీలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకుడు మరివాడ సూరిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

4,537 హెక్టార్లలో పంటనష్టం

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను కారణంగా మండలంలో 4,537 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి అన్నారు. మండలంలో పంట నష్టం నివేదిక సిద్ధమయ్యిందన్నారు. గ్రామాల వారీగా తయారు చేసిన నివేదికను ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించినట్లు వివరించారు.

ఏడిద సంఘమేశ్వరుడికి అన్నాభిషేకం



మండపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఏడిదలో వున్న సంఘమేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం అర్చకుడు శర్మ సారథ్యంలో స్వామి వారికి అన్నాభిషేకం చేశారు. కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సామాజిక స్థితిగతులను శాస్త్రీయంగా అర్థం చేసుకోవాలి

• చెకుముకి సంబరాల్లో వక్తల వెల్లడి • నైపుణ్య పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులు


కపిలేశ్వరపురం: అంగరలో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి లెనిన్‌బాబు

కపిలేశ్వరపురం, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మారుతున్న సామాజిక స్థితిగతులను శాస్త్రీయంగా అర్థం చేసుకోవల్సిన అవసరాన్ని విద్యార్థులు గుర్తించాలని యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు, సామాజిక కార్యకర్త డీవీ రాఘవులు, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి పెద్దింశెట్టి లెనిన్‌బాబు అన్నారు. అంగర జడ్పీ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ పర్యవేక్షణలో మంగళవారం చెకుముకి మండల స్థాయి సంబరాలు నిర్వహించారు. వేదిక అధ్యక్షులు వాసంశెట్టి శ్రీనివాస్ పర్యవేక్షణలో కార్యదర్శి పెద్దింశెట్టి లెనిన్‌బాబు, ఉపాధ్యాయులు సూర్యచంద్రరావు, కెవీవీ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 13 బృందాలు హాజరయ్యాయి. మండలస్థాయి నైపుణ్య పోటీలో ఒక్కో పాఠశాల తరఫున ముగ్గురితో కూడిన బృందం హాజరైంది. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమస్థానాన్ని వల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల, ద్వితీయస్థానంలో అంగర జడ్పీ ఉన్నత పాఠశాల, తృతీయస్థానంలో కాలేరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు బృందాలు నిలిచాయి. ప్రైవేటు పాఠశాలల విభాగంలో అంగరలోని శ్రీ విద్యానికేతన్‌కు చెందిన బృందం ప్రథమస్థానంలో, మరో బృందం ద్వితీయస్థానంలోని శ్రీ రామకృష్ణ ఉన్నత పాఠశాల బృందం తృతీయస్థానంలో నిలిచాయి. ప్రథమస్థానంలో నిల్చిన బృందాలు జిల్లాస్థాయి నైపుణ్య పోటీల్లో హాజరుకానున్నారు. విజేత బృందాలకు సామాజిక కార్యకర్త, ఉపాధ్యాయ సంఘం మాజీ రాష్ట్ర నాయకుడు డీవీ రాఘవులు, పెద్దింశెట్టి లెనిన్‌బాబు, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం శ్రీదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నల్లూరు, మాచర, వాకతిప్ప, కపిలేశ్వరపురం, టేకి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు.

సాయితేజా విద్యార్థులకు ప్రథమస్థానం

రాయవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా జరిగిన చెకుముకి పోటీల్లో రాయవరం సాయితేజ విద్యార్థులకు మండల స్థాయిలో ప్రథమస్థానం లభించినట్టు సాయితేజ స్కూల్ అకడమిక్ డైరెక్టర్లు కర్రి సందీప్‌రెడ్డి, భానురేఖ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన సబ్బెళ్ల హేమంత్ వీరవెంకట రెడ్డి, ఏలేటి జోయ్, నల్లమిల్లి విశ్వనాథరెడ్డిలు ప్రతిభ కనబర్చినట్టు ఆయన చెప్పారు. ప్రథమస్థానం సాధించిన విద్యార్థులను రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో-2 వై.సూర్యనారాయణ, కరస్పాండెంట్ కర్రి పద్మావతి, ఏవో పోలిమాటి సుధాకర్, అధ్యాపకులు అభినందించారు.

విజేతలకు బహుమతులు

ఆలమూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్వర్యంలో మంగళవారం మండలస్థాయి చెకుముకి పోటీలను జొన్నాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీలకు జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఖాన్, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు వైవీవీ రమణ, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు, ఎస్‌టీయూ మండల అధ్యక్షుడు సలాది శ్రీనివాస్ అధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తెలుగు మీడియం విభాగంలో చెముడులంక జడ్పీ హైస్కూల్, మూలస్థానం జడ్పీ హైస్కూల్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించారు. ఇంగ్లీషు మీడియంలో ఆలమూరు శ్రీసిద్ధార్థ హైస్కూల్, కొత్తూరు శ్రీవిద్యాపబ్లిక్ స్కూల్ ప్రథమ, ద్వితీయస్థానాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు బహుమతులు అందజేశామన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఆత్రేయపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలస్థాయిలో జనవిజ్ఞాన వేదిక చెకుముకి టాలెంట్ పోటీ పరీక్షలు నిర్వహించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన ఎంపీడీవో వెంకటరామన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లాస్థాయి ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపికైన జడ్పీ హైస్కూల్ విద్యార్థులు వై.మోక్షశ్రీ, వై.ధనఫణీంద్ర, వై.వీరేంద్ర పవన్, ప్రైవేట్ పాఠశాలల నుంచి మహర్షి విద్యానికేతన్‌కు చెందిన ఎన్.శ్రీరామ్‌వర్మ, వి.కార్తికేయ, ఆర్.సృజనలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్, అధ్యక్షులు రామకృష్ణ, రవిగోవిందు, ప్రసాద్, మహేష్, శ్యామ్ పాల్గొన్నారు.

కె.గంగవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు కె.గంగవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. పన్నెండు ఉన్నత పాఠశాలల నుంచి 13 టీములు పాల్గొన్నాయి. కె.మోక్ష నిఖిల, టి.సాయి అభిరామ్, వై.లక్ష్మీదుర్గ, ద్వితీయస్థానంలో ఎస్.వినీత, జి.తేజస్విని, పి.ప్రవల్లిక, తృతీయ స్థానంలో డి.మల్లేశ్వరి, జె.సత్యశాంతి, ఎం.సత్యకిరణ్ నిలిచారు. వీరికి జనవిజ్ఞాన వేదిక మండల గౌరవాధ్యక్షులు చిట్టూరి రామ్మోహన్ రావు బహుమతులు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక మండల కన్వీనర్ పీవీ బ్రహ్మానందం, ప్రధానోపాధ్యాయుడు పితాని శ్రీనివాసు, శ్రీధర్, రామలక్ష్మి, సుమతి, ఆయా పాఠశాలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): చెకుముకి సంబరాల్లో భాగంగా ద్రాక్షారామ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి పరీక్షలు నిర్వహించారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో స్కైలార్క్ గ్లోబల్ స్కూల్, కె.సాత్విక్ ప్రథమ, సీహెచ్ లహరి ద్వితీయ, మోక్షిత తృతీయ స్థానాలు, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్ నరసాపురపుపేట ప్రథమస్థానం, ఆర్.తేజస్వి ప్రథమ, ఎస్.స్రవంతి ద్వితీయ, వి.ప్రదీప్ తృతీయస్థానం పొందారు. గెలుపొందిన పాఠశాలలు, విద్యార్థులు 23న జిల్లాస్థాయిలో జరిగే చెకుముకి పోటీల్లో పాల్గొంటారని చెకుముకి పరీక్షల మండల కన్వీనర్ ఆర్.కనక రాజశేఖర్ తెలిపారు. విజేతలకు మండల విద్యాశాఖాధికారి కె.నాగేశ్వరి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కేవీవీ సత్యనారాయణ, ఖాజా మొయిద్దీన్, రత్న పద్మావతి, సీతామహాలక్ష్మి, టి.జగదీష్, కోడి ప్రసాద్, గాయిత్రి పాల్గొన్నారు.

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏడిద రోడ్డులో వున్న వేగుళ్ల సూర్యారావు ప్రభుత్వ హైస్కూల్లో మంగళవారం చెకుముకి టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి చింతా సోమిరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ పోటీల్లో జవహర్‌లాల్ మున్సిపల్ హైస్కూల్‌తోపాటు అన్నపూర్ణ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటి జిల్లాస్థాయిలో పోటీలకు అర్హత సాధించారు. కార్యక్రమంలో సమీర్‌అలీ, జేవీవీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జి.సుధాకర్, డి.మణికంఠ, జేవీవీ జిల్లా కార్యదర్శి గండి స్వామి ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, యూటీఎఫ్ పట్టణ కార్యదర్శి రాజేంద్ర తాడి శ్రీనువాస్, రామచంద్రారెడ్డి, యేసుబాబు తదితరులు పాల్గొన్నారు.

మండపేటను 'తూర్పు'లో విలీనం చేయాలి

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఇటీవల అఖిలపక్షం అధ్వర్యంలో అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందించామన్నారు. బుధవారం ఏడిదకు వస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌ను కలిసి అఖిలపక్ష నేతలతో కలిసి వినతిపత్రం అందజేస్తున్నామని తెలిపారు. అఖిలపక్షం నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి శ్రీపుష్పయాగం

రాయవరం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాయవరం తుల్యబాగ కాలువ వంతెన వద్ద ఉన్న గోవిందాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి శ్రీపుష్పయాగాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అర్చకుడు అత్తిలి రామకృష్ణ అర్చకత్వంలో జరిగిన కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శ్రీపుష్పయాగం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు

మండపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కేశవరం పంచాయతీ ఉపసర్పంచ్ ఉండమట్ల తులసితోపాటు మూడవ వార్డు పంచాయతీ సభ్యుడు హరేరామకృష్ణలు గ్రామానికి చెందిన టీడీపీ నేత యు.తాతాజీ నేతృత్వంలో మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీలో చేరారు. మండపేటలోని కార్యాలయంలో పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసు, కంటిపూడి శ్రీను, సత్తిబాబు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన కేశవరం గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు


వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యు నాయకులు

విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడలో విలీనం చేయాలని డిమాండు చేస్తూ 6న తలపెట్టిన బంద్‌లో భాగంగా విద్యా సంస్థలు బంద్ పాటించాలని పీడీఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్దూ కోరారు. మంగళవారం రామచంద్రపురంలో ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లయన్ జీవీ రావును కలసి నోటీసు అందజేశారు. ప్రజల డిమాండు సాధనకు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దొమ్మలపాటి సత్యనారాయణ, ప్రజా సంఘాల నాయకులు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యు నాయకులు నవీన్, ఐఎఫ్‌టీయు నాయకులు చింతా రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనపై యువత దృష్టిసారించాలి

డీఆర్‌డీఏ పీడీ జయచంద్రగాంధీ

కొత్తపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పరిశ్రమల స్థాపనపై యువత దృష్టిసారించాలని డీఆర్‌డీఏ పీడీ సాయినాథ్ జయచంద్ర గాంధీ సూచించారు. మంగళవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచనల మేరకు స్థానిక కల్యాణ మండపంలో ఎంఎస్‌ఎంఈపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ యువత, మహిళల్లో పారిశ్రామిక చైతన్యం పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, పల్లి భీమారావు, త్సామా బాబు, గనిశెట్టి వీరేష్ తదితరులతో పాటు ఇండస్ట్రియల్ ఎండీ అరుణ, ఫిషరీస్ ఏడీ వర్ధన్, లీడ్ బ్యాంకు మేనేజర్ రాజు, నాబార్డు మేనేజర్ స్వామినాయుడు, ఎంపీడీవో నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘ నేత ఇంటిపై దాడి

కొత్తపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కొత్తపేట సంత మార్కెట్ వీధిలో ఉంటున్న బీసీ సంఘ నాయకుడు మట్టపర్తి సూర్యచంద్రరావు ఇంటిపై మంగళవారం మద్యం సేవించిన యువకులు కొందరు వీరంగం సృష్టించారు. ఇంటిలో ఉన్న వస్తువులను ధ్వంసం చేసి దాడికి దిగారు. ఈ పరిణామానికి ఇంట్లో ఉన్న మహిళలు బెంబేలెత్తిపోయారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని యువకులను చెదరగొట్టారు. దీనిపై సూర్యచంద్రరావు కోడలు దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు.